
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



# తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 6 నవంబరు 2024 | 3


## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : దుర్గేష్

ఉండ్రాజవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాడిపర్రులో మృతుల కుటుంబాలను ఆదుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన మారిశెట్టి మణికంఠ, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణ, బొల్లా వీర్రాజు కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. ప్రమాదంలో నలుగురు యువకులు మృతిచెందడం ఎంతో బాధకలిగించిందన్నారు. కొద్దిరోజుల్లో కుటుంబాలకు తగిన సహాయసహకారాలు అందించి, అండగా ఉంటామన్నారు. అనంతరం ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. తాడిపర్రు విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మారిశెట్టి మణికంఠ, బొల్లా వీర్రాజు, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం చెక్కులు కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు వీరమల్లు బాలాజీ, సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు,తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రామారావు పాల్గొన్నారు.



మేమున్నాం : తాడిపర్రులో మృతుల కుటుంబీకులను ఓదారుస్తున్న మంత్రి దుర్గేష్



కొవ్వూరులో పుట్టవద్ద పూజలకు హాజరైన కుటుంబం



బిక్కవోలులో ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతుల పూజలు

## కాపాడమ్మా.. నాగమ్మా..



బిక్కవోలు,నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగ మ్మా.. కాపాడమ్మా అంటూ భక్తజనం మొక్కుకున్నారు. ఊరూవాడా నాగుల చవితిని ఘనంగా చేసుకున్నారు. పట్టణాల్లో పాము పుట్టలను వెతుక్కుంటూ వెళ్లి కలుగుల్లో పాలు, గుడ్లు వేసి మొక్కుకున్నారు.. తేగలు వేశారు.. చిమిలి, చలిమిడి వడపప్పు సమర్పించారు.. పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా పెద్దా అందరూ కుటుంబ సమేతంగా పండుగను ఘనంగా చేసుకున్నారు. పుట్టల వద్ద బాణసంచా కాల్చి ఆనందంగా గడిపారు. నాగులచవితి సందర్భంగా సహజమైన పుట్టతో దర్శనమిచ్చే బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయానికి భక్తజనం పోటెత్తారు.నాగుల చవితి, సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ ఎమ్మెల్యే దంపతులకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ, కొడమంచిలి సత్యనారాయణశర్మలు ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

## ఉత్తుత్తి కూలీలతో విచారణేది!

### తూతూమంత్రంగా ముక్కినాడలో విచారణ

రాజానగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముక్కినాడ గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో వెలుగుచూసిన అవినీతి, అక్రమాలపై మంగళవారం విచారణ జరిపారు. 'మస్తర్ల మాయాజాలం' శీర్షికన ఈ నెల 3న ఆంధ్రజ్యోతిలోవెలువడిన కథనంపై డ్వామా పీడీ నాగమహేశ్వరరావు స్పందించి విచారణకు ఆదేశించారు.ఈ మేరకు ఏపీడీ రాంప్రసాద్, రాజానగరం ఇన్‌చార్జ్ ఏపీవో బాలరాజుతో కలిసి మంగళవారం విచారణ చేపట్టారు.ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన జాబ్‌కార్డుదారుల పేర్లతో పాటుగా పనిలోకి రాకుండా వేతనాలు డ్రా చేస్తున్న మరి కొంత మంది పేర్లను గ్రామస్తులు అధికారులకు సమర్పించారు. దొంగ మస్తర్ల నమోదుపై ఆన్‌లైన్‌లో క్షుణ్ణంగా పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరు గురించి కూలీలను ఆరా తీశారు. అయితే గ్రామస్తులు మాత్రం అధికారుల విచారణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనిలోకి రాకుండా వస్తు న్నట్టుగా మస్తర్లు నమోదు చేసి వేతనాలు డ్రాచేస్తున్న ఉత్తుత్తి కూలీలను వదిలి పెట్టి..పనిలోకి వస్తున్న కూలీలను విచారించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.ఈ విషయమై విచారణాధికారిగా విచ్చేసిన రాంప్రసాద్‌ను సంప్రదించగా తొలిరోజు కొంత మందిని మాత్రమే విచారించామని,మరో పర్యాయం విచారిస్తామని బదులిచ్చారు.

## ప్రిన్సిపాల్‌కు బెదిరింపు పోస్టులు

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో దుర్భాషలాడుతూ.. .. చంపేస్తానని బెదిరింపు పోస్టులు పెడుతున్న జూనియర్ కళాశాల రికార్డు అసిస్టెంట్‌పై కేసు నమోదు చేశారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.వి.వి సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు.గత పది రోజులుగా విధులకు గైర్హాజరై- మద్యం సేవించి అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో చంపేస్తానని పోస్టులు పెడుతున్నాడు. దీనిపై ప్రిన్సిపాల్ జి. సతీష్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుపై ఇరు వర్గాల మధ్య 18 నెలలుగా వివాదం నెలకొంది. సోమవారం విగ్రహావిష్కరణ ఏర్పాట్లలో భాగంగా ఒక వర్గానికి చెందిన యువకులు 'గ్రామంలో ఎవడ్రా మమ్మల్ని ఆపేది' అంటూ 15 అడుగుల ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనికి ప్రతిగా మరో వర్గం యువకులు 'మేమేరా మిమ్మల్ని ఆపేది' అంటూ 20 అడుగుల ఫ్లెక్సీని తయారు చేయించారు. దీని ఏర్పాటులో కరెంట్ షాక్‌తో నలుగురు యువకులు మృతి చెందారు. ప్రశాంతంగా ఉండే గ్రామ సీమల్లోనూ ఇలాంటి స్లోగన్స్‌తో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు కక్షలను పెంచుతూ.. ప్రాణాలు తీస్తున్నాయి.



యమపాశం : తాడిపర్రులో ఈ ఫ్లెక్సీ పైన ఉన్న విద్యుత్ తీగ కారణంగా నలుగురు మృత్యువాతపడ్డారు..

ఎన్నికల్లో భాగంగా నిడదవోలు పట్టణంలో ఒక పొలిటికల్ మీటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.. కొంత మంది యువకులు కలిసి ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని తలంచారు.. అనుకున్నదే తడవుగా ఫ్లెక్సీ కట్టేందుకు ఉపక్ర మించారు.. పైన విద్యుత్ తీగలు ఉన్న సంగతి గమనించక పోవడంతో ఫ్లెక్సీ కడుతుండగానే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ఒక యువకుడు మృతిచెందాడు.

# ఫీక్స్‌కు.. ఫ్లెక్సీలు!




## భారీ కటౌట్‌లు.. విద్వేషపూరిత రాతలు

- తాడిపర్రు ఘటనకూ ఇదే కారణం
- పెరుగుతున్న ప్రమాదాలు.. వివాదాలు
- గాలిలో కలిసిపోతున్న ప్రజల ప్రాణాలు
- పచ్చని పల్లెలకూ పాకిన విద్వేషాలు
- అనవసర గొడవలకు ఫ్లెక్సీల ఆజ్యం
- చర్యలు తీసుకోకుంటే ముప్పు

రాజమహేంద్రవరం/పెరవలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రచారం పిచ్చి ఫీక్స్‌కి చేరింది.. ప్రస్తుతం ఫ్లెక్సీల ఏర్పాటు ట్రెండ్‌గా మారింది.. సందర్భమేదైనా ఫెక్సీలు పెట్టడం ఆనవాయితీగా మారిపోయింది.గ్రామాల్లో రాజకీయనేతలు, యువత కూడా ప్రచారం కోసం ఫ్లెక్సీలు కట్టడం ఫ్యాషన్‌గా మారిపోయింది.ఎక్కడికక్కడ వ్యక్తిగతంగా కూడా ఫెక్సీలు పెట్టేసుకుంటున్నారు. కేవలం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడో, ప్రజా ప్రతినిధులకో,అధికారులకో కోపం వచ్చినప్పుడో ఫెక్సీలను తొలగించడం,తర్వాత మౌనం వహించడం అలవాటైపోయింది. ఇటీవల సుప్రీం కోర్టు కూడా పబ్లిక్ స్థలాల్లో ఫ్లెక్సీలపై సీరియస్ అయిన సంగతి తెలిసిందే.అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో ఫెక్సీ కడుతూ నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో ప్రస్తుతం ఫెక్సీల మీద చర్చ మొదలైంది. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌లో ఫెక్సీలు పెట్టడానికి సిటీ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి ఉండాలి. అయినా అధికారులు పట్టించుకోరు.ఈ నేపథ్యంలో ఎవరికి వారు ఇష్టానుసారంగా ఫెక్సీలు పెడుతున్నారు.ఒక్కొక్కసారి ఈ ఫ్లెక్సీలు వివాదాలకు కారణమవుతున్నాయి..రెండు వర్గాల మధ్య గొడవలకు దారితీస్తున్నాయి.. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు మీదకు తెస్తున్నాయి..ఇటీవల పెళ్లయినా.. పేరంటమైనా.. రాజకీయ నాయకులు వస్తున్నా.. అభిమాన హీరో సినిమా రిలీజ్ అయినా.. పుట్టిన రోజైనా.. చావైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సంప్రదాయంగా మారిపోయింది.ఆ ఫ్లెక్సీల ఏర్పాటుపై పరిమితి లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టానుసారం ఫ్లెక్సీలు పెడుతున్నారు. చిన్న సైజు ఫ్లెక్సీలు కాకుండా పెంచుకుంటూ పోతుండడంతో ఒక్కోసారి ప్రమా దాలకు కారణమవుతున్నాయి. చాలా చోట్ల వివాదాలు జరుగుతున్నాయి. ఈ ఫ్లెక్సీలు ఏర్పాటులో రాజకీయ పరంగా, కులాల పరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఎంత ఖర్చయినప్పటికీ ఎదుటి వారు పెట్టిన ఫ్లెక్సీ కంటే పెద్దగా ఉండాలన్న ఉద్దేశంతో ఐరెన్ రాడ్‌లు ఏర్పాటు చేసి మరీ ఎత్తులో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అది 10 అడుగులు.. 20 అడుగులు..30 అడుగులు ఇలా పెంచుకుంటూ పోతున్నారు.ఇష్టానుసారం పెడుతున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఫ్లెక్సీల ఏర్పాటుపై అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. మిగిలిన రోజుల్లో ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో ఇష్టానురీతిన ఎక్కడబడితే అక్కడ ఎవరికి నచ్చిన చోటులో వారు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. మెయిన్ రోడ్లు కూడలి ప్రదేశాల్లో వీటిని అధిక సంఖ్యలో ఏర్పాటు చేయడంతో ఇబ్బందిగా మారుతున్నాయి. ఈ ఫ్లెక్సీల కారణంగా పలు సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో అనేక సందర్భాల్లో విద్యుదాఘాతానికి గురై అనేక మంది మృత్యువాతపడిన సందర్భాలు ఉన్నాయి. సోమవారం తాడిపర్రులో కూడా ఇదే విధంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తూ నలుగురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. గతంలో నిడదవోలు పట్టణంలోనూ ఫ్లెక్సీ కడుతూ ఒక యువకుడు మృత్యువాతపడ్డాడు. దివాన్‌చెరువులో ఓ స్కూల్ ఫ్లెక్సీ కడుతూ ఒకరు మృతి చెందారు. కొంత కాలం కిందట ఏవీ అప్పారావురోడ్డులో ఓ విద్యా సంస్థ ఫ్లెక్సీ కడుతూ ఒకరు మృతి చెందారు. అప్రమత్తంగా లేకపోవడం వల్ల ఇలా చాలా చోట్ల జరుగుతున్నాయి. గతే డాది కొవ్వూరు మండలం దొమ్మేరులో అప్పటి హోంమంత్రి వనిత ఫ్లెక్సీని చిం చాడనే కారణంతో ఓ వైసీపీ కార్యకర్తను పోలీసులు వేధించడంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు.ఫ్లెక్సీల కారణంగా గ్రూపులు తయారవుతున్నాయి. కొవ్వూరు, రాజమహేంద్రవరం,అనపర్తి, రాజానగరం,గోపాల పురం నియోజకవర్గాల్లోనూ ఫ్లెక్సీ వివాదాలు తారస్థాయికి చేరిన ఘటనలు ఉన్నాయి. తాడిపర్రులో కలెక్టర్ ప్రశాంతి పర్యటించి ఘటనకు ఫ్లెక్సీ వివాదమే కారణమని గమనించారు. గ్రామంలో ఫ్లెక్సీలన్నీ తొలగించాలని ఆదేశించారు.ఏ విధమైన ఫ్లెక్సీలు లేకుండా పంచాయతీ ,రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ముం దుగానే అధికార యంత్రాంగం ఆ పనిచేసి ఉంటే ఈ రోజు మా కుమారులు మా కళ్లెదుటే ఉండేవారని ఫ్లెక్సీల ఏర్పాటుపై నిబం ధనలు విధిం చాలని డిమాండ్ చేశారు.



### ఫ్లెక్సీని 10 అడుగుల లోపే పెట్టాలి..

ఫ్లెక్సీలు నేల నుంచి 6 నుంచి 10 అడుగులలోపే పెట్టుకోవాలి. ఎత్తు పెరిగితే ప్రమాదాలు జరుగుతాయని తూర్పు గోదావరి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ బాలగంగాధర్ తిలక్ చెప్పారు. విద్యుత్ లైన్ మూడడుగుల ఎత్తులో ఏది ఉన్నా కరెంట్ షాక్ కొడుతుందని చెప్పారు.

### ప్రభుత్వం చర్యలు చేపట్టాలి..

ఫ్లెక్సీల ఏర్పాటుపై నిబంధనలు కఠినతరం చేయాలి. ఫ్లెక్సీ ఏర్పాటుచేసే ముందు సంబంధిత అధికారికి చూపించిన తర్వాతే ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి. ఫ్లెక్సీలపై ఎదుటి వర్గం, కులం వారిని, హీరోల అభిమానులను రెచ్చగొట్టేలా అవమానించే విధంగా రాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. అవతలి వర్గం వారి ఫ్లెక్సీలను చించి వేస్తూ గొడవలకు కారణమవుతున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే భవిష్యత్తులో ఫ్లెక్సీల వివాదాలు అమాయక ప్రజలపై పడి వారు ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అవసరమైతే ఇసుక తీసుకెళ్లొచ్చు

### ఓపెన్ ర్యాంపుల నుంచి ట్రాక్టర్లతో ఉచిత ఇసుక

- ఇసుక సరఫరాపై నిఘా
- ఉచిత నిల్వ చేయవద్దు
- నిబంధనలు మీరితే చర్యలే
- కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

రాజమహేంద్రవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సొంత అవసరాలకు ఇసుకను ఓపెన్ ర్యాంపుల నుంచి ట్రాక్టర్ల ద్వారా తవ్వుకుని తీసుకెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా తమ సొంత అవసరాలకు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకెళితే ఎవరూ అభ్యంతరం చెప్పరన్నారు.ఇసుకను నిల్వ చేసుకుని వేరేవాళ్లకు విక్రయిస్తే మాత్రం నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం 9 డీసిల్టేషన్ పాయింట్ల నుంచి ఇసుక తీస్తుండగా, 16 ఓపెన్ రీచ్‌లకు అనుమతి ఇచ్చామని అందులో ఐదు ఇప్పటికే ఓపెన్ అయ్యాయన్నారు. ర్యాంపులలో నీరు ఉండడం వల్ల కొంత సమస్య వచ్చిందని, ఈవారంలోపు మొత్తం ఓపెన్ కావాలన్నారు.ఇసుక కొరత లేదని, జిల్లాలో అవసరానికి మించి ఇసుక వస్తుందన్నారు. కోటిలింగాలరేవు, ఇతర ప్రాంతాల్లో రాత్రుల వేళ ఇసుక డ్రెడ్జింగ్ జరుగుతుందని కొందరు చెప్పారు. దీనిపై స్పందించిన ఆమె ఎస్పీతో కలసి అధికారులు దృష్టిపెడుతున్నారని, ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి ఎవరు డ్రెడ్జింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మిగతా ర్యాంపుల్లో కూడా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామని, గాయత్రి ర్యాంపులో మూడు ఇసుక లారీలను సీజ్ చేసినట్టు ఆమె తెలిపారు.

### గాయిత్రి ర్యాంప్‌లో 3 టిప్పర్లు సీజ్

ధవళేశ్వరం,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ధవళేశ్వరంలోని గాయిత్రి ఇసుక ర్యాంప్‌ను మంగళవారం ఉదయం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇసుక లోడ్‌చేసిన 3 టిప్పర్‌లను గమనించి వాటిని తనిఖీ చేసి డ్రైవర్లను ప్రశ్నించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేకుండానే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. సదరు లారీ యాజమాన్యంపై విచారణచేసి ఇసుక టిప్పర్లను సీజ్ చేయాలని దక్షిణ మండలి డీఎస్పీ భవ్య కిషోర్‌కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలనలో నిర్దేశించినమార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కృష్ణనాయక్ అన్నారు.

### కాటవరంలో లారీ పట్టివేత

సీతానగరం,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కాటవరం గ్రామం వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని సీజ్ చేశామని ఎస్ఐ డి.రామ్ కుమార్ మంగళవారం తెలిపారు. సీతానగరం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న లారీ పట్టుకుని స్టేషన్‌కు తరలించి ఏడీ మైన్స్‌కు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉచిత ఇసుక పేరుతో వందలాది ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తూ కొంతమంది ఇసుకను అక్రమంగా నిల్వచేసి లారీలలో లోడ్ చేస్తున్నట్టు తెలుస్తోంది ఈ నేపథ్యంలో అక్రమ ఇసుక లారీని పోలీసులు పట్టుకున్నారు.




గాయత్రి ర్యాంపులో తనిఖీ చేస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్



కాటవరంలో సీజ్ చేసిన టిప్పర్



కలెక్టర్ ప్రశాంతి

# ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు

**11నుంచి నామినేషన్ల స్వీకరణ**

**సహాయ రిటర్నింగ్ అధికారిగా డీఆర్వో శ్రీరామచంద్రమూర్తి**

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో 4 తేదీ నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఎన్నికల ప్రక్రియ ముగిసే డిసెంబర్ 12 వరకూ ఈ కోడ్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్, జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.శ్రీరామచంద్రమూర్తితో కలిసి ఆమె మాట్లాడారు. పూర్వపు ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ జారీ చేసిందన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) టి.శ్రీరామచంద్రమూర్తి వ్యవహరిస్తారని చెప్పారు. మొత్తం గోదావరి జిల్లాల పరిధిలో ఎన్నికలు జరుగుతున్నాయని, అందులో భాగంగా జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు అక్కడే ఓటుహక్కు వినియోగించుకోవాలని చెప్పారు. మండలానికి ఒకటి వంతున జిల్లాలోని 18మండలాల్లో 10 కేంద్రాలు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. జిల్లాలో మొత్తం 2893 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారన్నారు.

**11నుంచి నామినేషన్ల స్వీకరణ**

ఈ ఉప ఎన్నికకోసం ఈనెల 11న నోటిఫికేషన్ జారీ కానుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అదేరోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారని, 18వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారని, 19న నామినేషన్ల స్క్రూటినీ చేసి 21న అభ్యర్థుల విత్‌డ్రాకు చివరి తేదీ అన్నారు. డిసెంబర్ 5న పోలింగ్ జరుగుతుందని, 9న ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. 12వ తేదీకి మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నేటితో ముగుస్తున్న గడువు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదుకు 1,34,298 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఓటు నమోదు అధికారి, కాకినాడ జిల్లా డీఆర్వో వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారంతో ఓటు నమోదు గడువు ముగుస్తోందన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా 1785, కాకినాడ జిల్లా 25,964, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 28,227, తూర్పుగోదావరి జిల్లా 24,825, పశ్చిమ గోదావరి జిల్లా 31,757, ఏలూరు జిల్లాలో 21,740 దరఖాస్తులు వచ్చాయన్నారు. అర్హులైన పట్టభద్రులు బుధవారం కూడా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అభ్యర్థులు ఓటు కోసం తహశీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

లేటరైట్ తవ్వేటప్పుడు క్యూబిక్ మీటర్లలో కొలుస్తారు. తవ్విన తర్వాత తరలింపు సమయంలో దాన్ని మెట్రిక్ టన్నులుగా పరిగణిస్తారు. ఇది రా మెటీరియల్‌గానే ఉండగా గ్రేడ్‌ను బట్టి ధర ఉంటుంది. లేటరైట్ ఒక మెట్రిక్ టన్ను ధర - రూ.950 నుంచి రూ.1100 ఉంటుంది.

వంతాడ సముద్ర మట్టానికి - 350 మీటర్ల ఎత్తులో ఉంది
ఇక్కడ లీజుకు తీసుకున్నది - 220 ఎకరాల అటవీ భూమి
ఇక్కడి గృహాల సంఖ్య- 110... జనాభా - 550మంది

2013 నుంచి 2033 వరకు వంతాడ రిజర్వ్‌ఫారెస్ట్‌లో లాటరైట్ తవ్వకాలకు ఆంధ్రా మైనింగ్ కంపెనీ లీజు పొందింది.

ఇప్పటివరకు తవ్వింది - మొత్తం 83.29లక్షల మెట్రిక్ టన్నులు
ఒడిశాకు తరలించినది - 32.75లక్షల మెట్రిక్ టన్నులు
చైనాకు తరలించినది - 4.65లక్షల మెట్రిక్ టన్నులు

# ఈస్ట్ కేజీఎఫ్.. వంతాడ!






వంతాడలో లేటరైట్ తరలింపునకు క్యూకట్టిన లారీలు

వంతాడలో లేటరైట్ తవ్వకం

కేజీఎఫ్ గుర్తుందా.. అక్కడ కోలార్ గోల్డ్ ఫీల్డ్స్.. బంగారం కోసం జరిగే అన్వేషణ.. రయ్యిమంటూ దూసుకెళ్లే టిప్పర్లు.. అదొక ప్రత్యేక ప్రపంచం.. అలాంటిదే ఇక్కడా మన ఈస్ట్‌లోను ఉందండి.. కానీ ఇక్కడ లేటరైట్ తవ్వుతుంటారు. సముద్ర మట్టానికి 350 మీటర్ల ఎత్తులో ఎక్కడో కొండపై ఉండే ఈ ప్రాంతానికి సాధారణ వాహనాల్లో వెళ్లలేం. సరైన రోడ్డు మార్గం కూడా లేదు. ఘాట్ రోడ్డు తరహాలో ఉండే ఒకే ఒక్క దారిలో నిత్యం లేటరైట్ లోడుతో లారీలు రయ్‌మంటూ దూసుకుపోతుంటాయి. ఈ లేటరైట్ తరలింపునకు ప్రత్యేకంగా ఓ రైల్వేస్టేషన్ కూడా ఉంది. ఆ ఉమ్మడి జిల్లా కేజీఎఫ్ ఎక్కడ ఉందో తెలుసుకోవాలనుందా అయితే ఈ కథనం చదివేయండి మరి..

ప్రత్తిపాడు,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప..ఊరు దిబ్బ అంటే ఇదేనేమో.. ఒక పక్క ప్రతి రోజూ కోట్లలో టర్నోవర్.. మరో పక్క కనీసం రోడ్డు మార్గం కూడా గిరిజన తండా అది.. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఈ.గోకవరం పంచాయతీ పరిధిలో వంతాడ గ్రామం ఉంది..

## లేటరైట్ ఎగుమతికే ప్రత్యేక రైల్వేలైన్

వంతాడలో రెండు దశాబ్దాలుగా లేటరైట్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి ముడిసరుకును 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న తొండంగి మండలం రావికంపాడుకు టిప్పర్లలో తరలిస్తారు. అక్కడ ఈ లేటరైట్ తరలింపునకు ప్రత్యేకంగా రైల్వేస్టేషన్ నిర్మించారు. దగ్గర్లోని మెయిన్ రైల్వే లైన్ నుంచి ఇక్కడకు ప్రత్యేక లైన్ కూడా వేశారు. వంతాడ నుంచి ఇక్కడకు తెచ్చిన లేటరైట్‌ను రావికంపాడు రైల్వేస్టేషన్ నుంచి ఒడిస్సాకు గూడ్స్ రైళ్లలో ఎగుమతి చేస్తారు. అక్కడ అల్యూమినియం ఫ్యాక్టరీల్లో దీన్ని ప్రాసెసింగ్ చేసి స్టీల్ తయారీకి వినియోగిస్తారు. తెలంగాణ



రావికంపాడులో రైల్వేస్టేషన్ వద్ద లేటరైట్ గుట్టలు

- లేటరైట్ గనులకు ప్రసిద్ధి వంతాడ
- ఏడాది పొడవునా లేట..రైట్
- రవాణాకు ప్రత్యేక రైల్వేస్టేషన్
- రావికంపాడు టూ ఒడిస్సా
- సీఆర్ఎస్ నిధుల ఊసేలేదు
- కానరాని మౌలిక వసతులు
- యువతకు ఉపాధి లేదు..
- అయినా పట్టని నాయకగణం

ఇక్కడ 110 గృహాలు ఉండగా 550 మంది జనాభా నివసిస్తున్నారు.ఎందుకంటే ఇది ఒక గిరి జన తండా..ఇందులో విశేషమేముందని తీసిపారేయవద్దు అసలు విషయం తెలిస్తే ఆశ్చర్యపోక మానరు.. ఒకప్పుడు పచ్చటి అందాలకు నెలవు. కానీ ఇప్పుడు లేటరైట్ మైనింగ్‌కి పెట్టింది పేరు.. ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండడంతో ఏడాది పొడవునా మైనింగ్ తవ్వకాలు జరుగుతుంటాయి. కానీ ఆ ఊరు మాత్రం అభివృద్ధికి ఎంతో దూరంగా ఉంది. అత్యవసరమైతే మరో దారిలో కొండ దిగి వెళ్లాల్సి ఉంటుంది. ఓ పక్క రూ.కోట్లలో టర్నోవర్ జరిగే లేటరైట్ తవ్వకాలు.. మరో పక్క కనీస అభివృద్ధికి నోచుకోని ఊరు.. ఇంత వ్యత్యాసం ఉన్న ఈ ప్రాంతం పేరు వంతాడ.. అయినా పాలకులకు పట్టడం లేదు.

## కళ్లెదుటే బంగారం..గ్రామాభివృద్ధి శూన్యం



వంతాడ గిరిజన గ్రామం

## లేటరైట్ అంటే..

లేటరైట్ అంటే ఉష్ణమండల ప్రాంతాల్లో భూమిలో లభించే అరుదైన ఖనిజం.దీన్ని నిర్మాణ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువగా వినియోగిస్తారు. ఇది అత్యంత విలువైన వనరు. దీని తవ్వకం వల్ల పర్యావరణపరంగా,స్థానికంగా ప్రతికూల ప్రభా వం చూపిస్తుంది. ఈ లేటరైట్ తవ్వగా వచ్చే ముడి సరుకు సిమెంట్, అల్యూమినియం ఫ్యా క్టరీల్లోసిమెంట్,స్టీల్ తయారీకి ఉపయోగిస్తున్నారు.

## లేటరైట్ గనులకు ప్రసిద్ధి..

ఇ.గోకవరం పంచాయతీ పరిధిలో వంతాడతో పాటు గిరిజనాపురం, ఎరకంపాలెం, ఆరేళ్లధార, వే ములపాలెం హామ్లెట్లుగా ఉన్నాయి. వంతాడలో మాత్రమే లేటరైట్ గనులు పుష్కలంగా ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో 20 ఏళ్ల కిందటే గుర్తించారు.అప్పటి నుంచి ప్రభుత్వ అనుమతుల మేరకు పలు కంపెనీలు ఇక్కడ తవ్వకాలు చేప డుతున్నాయి.మొదట్లో మహేశ్వరి కంపెనీ లీజుకు తీసుకుని తవ్వకాలు చేపట్టింది. తర్వాత కొన్ని కం పెనీలు మారాయి. ప్రస్తుతం ఆంధ్రా మినరల్స్ అనే కంపెనీ లీజు నడుస్తోంది.ఈ కంపెనీ వం తాడ కొండ పరిధిలోని 220 ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలకు లీజుకు తీసుకుంది.ప్రస్తుతం వంతాడ గనులపై లేటరైట్ గనుల తవ్వకాలు సాగుతున్నాయి. గతంలో 200 వరకు లారీలు కొండ పైనుంచి కిందకు వచ్చేవి. ఇప్పుడు 50 లారీల వరకు రవాణా చేస్తున్నట్టు సమాచారం.

## చంద్రబాబు టు పవన్ సుపరిచితమే..

వంతాడ గ్రామాన్ని ఎందరో రాజకీయ ఉద్దండులు గతంలో సందర్శించారు. వంతాడ లేటరైట్ గనుల్లో అక్రమాలు, దోపిడీలకు వ్యతిరేకంగా గిరిజనులు, ప్రజా సంఘాలు పోరాటాలు నిర్వహించాయి. వంతాడ గ్రామాన్ని అప్పట్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడిగా చిరంజీవి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, సీపీఐ, సీపీఎం నేతలు నారాయణ, మాజీ ఎంపీ మిడియం బాబురావు, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ సందర్శించారు.గ్రామంలోని రావిచెట్టు రచ్చబండ వద్ద సమావేశాలు నిర్వహించి గిరిజనుల సమస్యల పరిష్కారానికి హామీలు ఇచ్చారు. అయినప్పటికీ వంతాడ వాసుల గోడు అరణ్యరోదనగానే మిగిలింది. ఈ గిరిజనగూడెం సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగానే ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి వంతాడ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

## తరగని నిధి ఉన్నా..సమస్యలే

ప్రత్తిపాడు, రాజవొమ్మంగి మండల గ్రామాల సరిహద్దులో ఉన్న వంతాడ రెండు దశాబ్దాలుగా లేటరైట్ మైనింగ్ గనుల తవ్వకాలకు కేంద్రంగా ఉంది. కోట్ల రూపాయలు సంపద చుట్టూ ఉన్నా ఆ గిరిజన గూడెం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. ఇక్కడ గనుల తవ్వకాల మాటున జరిగిన అన్యాయాలపై గిరిజనులతో పాటు ప్రజాసంఘాలు, ఎన్నో పార్టీలు పోరాడాయి. దీంతో ఈ గూడెం పేరు అప్పట్లో మార్మోగింది. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి నేతల సందర్శనతో వంతాడ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది.అయినా కనీస వసతుల్లేక ప్రజలు అల్లాడుతున్నారు.కొండపై 110 నివాస గృహాలున్నాయి.వీటిలో 550 మంది నివసిస్తున్నారు.వీరిలో ప్రస్తుతం 90 మంది నివాస గృహాలకు దరఖాస్తు చేసినా మంజూరు కాక గృహాలు నిర్మించుకోలేకపోయారు. జలజీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి పథకానికి మోటారు ఏర్పాటు చేయకపోవడం వల్ల గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మైనింగ్ కంపెనీ అవసరాల నిమిత్తం ఈ గ్రామంలో ఇనుప స్థంభాలను ఏర్పాటు చేసి కరెంటును సరఫరా చేశారు. ఈ స్థంభాలకు విద్యుత్ సరఫరా జరిగి పశువులు, గొర్రెలు, మేకలు వంటి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో వాటి స్థానే సిమెంటు స్థంభాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. గ్రామంలో 1 నుంచి 6వ తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ 33 మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కానీ బెంచీలు, ప్రహరీ, మరుగుదొడ్లు, కాంపౌండ్ హాలు వంటివి సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

## అనారోగ్యం వస్తే కొండ దిగాల్సిందే..

- వంతాడ గ్రామం పెద్దిపాలెం పీహెచ్‌సీలో ఉంది.గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే వాళ్లు కొండ దిగి ఆ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే. పెద్దిపాలెం పీహెచ్‌సీ నుంచి నెలకోసారి వైద్యులు వచ్చి వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు.
- **వంతాడ** గిరిజనులకు ఉపాధి అవకాశాల్లేవు.లేటరైట్ మైనింగ్‌లోనైనా ఉపాధి కల్పించాలన్న డిమాండ్ ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 30 నుంచి 40 మంది పనిచేసేవారు.గత వైసీపీలో వారిని పనులు నుంచి తొలగించారు.
- గ్రామంలో లేటరైట్ అవసరాల నిమిత్తం తవ్వేసిన కొండలు అలానే వదిలేశారు.దీంతో వర్షాలు పడినప్పుడు ఆ గోతుల్లో నీరు ఉండిపోయి ప్రమాదకరంగా మారుతోంది. నిబంధనల ప్రకారం తవ్వకాలు చేపట్టిన చోట ఏర్పడిన గోతులను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పూడ్చాలి. కానీ, మైనింగ్ కంపెనీలు అలా చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.
- కొండపోడు భూముల రెవెన్యూ పట్టాలకు గిరిజనులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. అది నెరవేర్చాలని వారు కోరుతున్నారు.

## వంతాడకు దారేది..

వంతాడ గ్రామానికి రౌతుపాలెం వైపు నుంచి ప్రత్తిపాడు వెళ్లడానికి ఒకదారి ఉంది. వంతాడ నుంచి కొండ దిగి రౌతుపాలెం రావాలి. అక్కడి నుంచి లంపకలోవ మీదుగా ప్రత్తిపాడుకు 10 కిలోమీటర్లు పడుతుం ది. కొండ తిమ్మాపురం వైపు నుంచి ఏలేశ్వరం వెళ్లడానికి మరొక దారి ఉంది. కానీ వర్షాల కార ణంగా దెబ్బతిని అది మూతపడిపోయి ఉంది. కొండ తిమ్మాపురం రహదారి కాలిబాట మార్గంగా మిగిలిపోయింది.ఈ రహదారులు ఘాట్ రోడ్డులా ఉండి ప్రమాదకర మలుపులు తిరిగి ఉంటాయి. బొలేరో లాంటి వాహనాలు తప్ప సాధారణ వాహ నాల్లో వెళ్లలేం. ఈ రెండు రహదారులను పక్కా బీటీ రహదారులుగా అభివృద్ధి చేయాలని గిరిజనుల కోరుతున్నారు.



### మైనింగ్‌లో పని కల్పించాలి



వంతాడ లేటరైట్ మైనింగ్‌లో యువతకు పనిబాట్లు కల్పించాలి. గ్రామంలో అనారోగ్యాలకు గురైన వారిని ఏలేశ్వరం, ప్రత్తిపాడుకు తరలించడం కష్టసాధ్యంగా మారింది. రౌతుపాలెం, కొండ తిమ్మాపురం రహదారి మార్గాలు అభివృద్ధి చేయాలి.

-కుడే రాజబాబు, యువకుడు, వంతాడ

### సీనరేజి రావడం లేదు..



ఐదేళ్లుగా మైనింగ్‌కు సంబంధించిన సీనరేజి రావడంలేదు. ఆదాయం ఆగిపోయింది. గతంలో సీనరేజీ బానే వచ్చేది. అంతకుముందు ఏడాదికి రూ.2లక్షల వరకు వచ్చేది. మాకున్న సమాచారం మేరకు ఈ నెల నుంచి రావొచ్చని ఆశిస్తున్నాం.

-వనపర్తి రామలక్ష్మి, సర్పంచ్, వంతాడ

## తవ్వకాలతో విధ్వంసం

తూర్పు కనుమలను విధ్వంసం చేస్తూ వంతాడలో లేటరైట్ తవ్వకాలపై పర్యావరణవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొండల తవ్వకంవల్ల దుమ్ము, ధూళి రేగి పరిసరాల్లోని పచ్చదనం దెబ్బతింటోందని, లారీల్లో లేటరైట్ తరలింపుతో చుట్టపక్కల పంటలపై దుష్ప్రభావం చూపిస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ చేసిన ప్రాంతాలను నిబంధనల ప్రకారం నీటితో తడపాల్సి ఉన్నా అదీ చేయడంలేదని వాపోతున్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ కూడా స్థానికంగా ఖర్చుచేసిన దాఖలాలు లేవనివారు అభిప్రాయపడుతున్నారు.

**ఉభయ గోదావరి జిల్లాల**

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యాచరణ

- కాకినాడ కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరణ
- ఆరు జిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలు...16,316 మంది ఓటర్లు
- నామినేషన్ల దాఖలకు ఆరు జిల్లాల నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు రావాల్సిందే
- కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా 11న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను నియమించారు. కాకినాడ కలెక్టరేట్‌లోనే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. దీంతో కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆరు జిల్లాల నుంచి నామినేషన్ల దాఖలకు కాకినాడ కలెక్టరేట్‌కు రావాల్సి ఉంది. అసిస్టెంట్ ఎన్నికల రిట్నరింగ్ అధికారులుగా కాకినాడ డీఆర్వో జె.వెంకటరావు, తూర్పు గోదావరి జిల్లా డీఆర్వో సీతారామ్మూర్తి, కోనసీమ జిల్లా డీఆర్వో వి.మదన్‌మోహన్, పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు డీఆర్వో వి.విశ్వేశ్వరరావులను నియమించారు. వీరు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**పోలింగ్ కేంద్రాలు జిల్లాలవారీగా..**

ఆరు జిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 కేంద్రాలు, తూర్పు గోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 20 కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 22 కేంద్రాలు, కోనసీమ జిల్లాలో 12 కేంద్రాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

**ఓటర్లు జిల్లాల వారీగా..**

మొత్తం 16,316 మంది ఓటర్లు ఉన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 2893, ఏలూరు జిల్లాలో 2605, కాకినాడ జిల్లాలో 3333, కోనసీమ జిల్లాలో 3209, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,662 ఓటర్లు ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీకి సంబంధించి నియోజకవర్గాల పరిధిని ఎన్నికల సంఘం ఇలా నిర్ణయించింది. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాల్లోని ఉంగుటూరు, భీమ డోలు, నిడమర్రు, గణపవరం, పెదవేగి, పెదపా డు, దెందులూరు, ద్వారకా తిరుమల, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, కుక్కునూరు, వేలేరుపాడు, చింతలపూడి, లింగపాలెం, కామవరపుపేట, జంగారెడ్డిగూడెం మండలాలు, అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, ఏజెన్సీ గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, దేవీపట్నం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, చింతూరు, వరరామచంద్రపురం, ఎటపాక, కూనవరం మండలాలుగా నిర్ణయించింది.



అమెరికాలోని టెక్సాస్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న భార్యాభర్తలు సలాది కొండలరావు, సూరవరపు అనురాధ

## ఎన్నికలు హోరాహోరీగా జరుగుతున్నాయి

పిఠాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్ష పదవికి ఈ సారి హోరాహోరీగా ఎన్నికలు జరుగుతున్నాయి. కాకినాడ, పిఠాపురం పట్టణాలకు చెందిన మేము అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నాం. డొనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఆయన గెలిస్తే మార్కెట్ బాగుంటుందని మా భావన. అయితే పోటీ తీవ్రంగానే ఉంది. ఎవ్వరికి గెలుపు అంత సులభం కాదు. భారతీయ సంతతికి చెందిన కమలాహారిస్‌కు కూడా ఓటర్లు మద్దతు అధికంగానే ఉంది. ఎవ్వరు గెలుస్తారన్నది ఉత్కంఠగానే ఉంది.





1996 సంవత్సరంలో తుఫాను చిత్రాలు(ఫైల్)

# అదో కాళరాత్రి

**నవంబరు 6 అంటేనే కోనసీమ వాసులకు హడల్..**

**28 ఏళ్ల క్రితం సృష్టించిన హరికేన్ పెను విధ్వంసం**

(ఆంధ్రజ్యోతి-మండపేట)

పచ్చదనం, అసూయపరిచే అందం కోనసీమ సొంతం... అటువంటి సుందర సీమను పెను తుఫాను అతలాకుతలం చేసింది. 1996 నవంబరు 6 బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన చినుకులు ఈదురుగాలులై పెను తుఫానుగా మారి పచ్చని సీమను అస్తవ్యస్తం చేసింది. జన నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం, పశు నష్టం...ఇలా అనేక విధాలుగా కోనసీమ కాటిసీమగా మారింది. ఇది జరిగి నేటికి 28 సంవత్సరాలు కావస్తోంది. ఆనాటి కాళరాత్రిని ప్రజలు నేటికీ మరచిపోలేరు. లక్షల్లో నేలవాలిన కొబ్బరిచెట్లు తలలు వాల్చాయి. వేలల్లో జనం మృత్యువాతపడ్డారు. గృహాలు పేకమేడల్లా కూలిపోయాయి. మత్స్యకార తీర ప్రాంతాలు, గ్రామాలకు జరిగిన నష్టం అపారం. అప్పట్లో సీఎంగా వున్న చంద్రబాబు యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. హుటాహుటిన ప్రత్యేక హెలికాప్టర్ ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచి అమలాపురం చేరుకున్నారు. కోనసీమ అంతటా పర్యటిస్తూ అధికారులను, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారు. రాజమహేంద్రవరంలోనే ఉండి తాత్కాలిక సెక్రటేరియట్ ఏర్పాటు చేశారు. అంధకారంలో మునిగిన కోనసీమలో విద్యుత్ కాంతులు వచ్చే వరకు, ప్రజలకు సహాయ చర్యలు అందే వరకు అవిశ్రాంతంగా శ్రమించారు. ఆయన చతురతకు తోడు అధికారులు, నేతల సహకారం ప్రజలకు కొంతమేర ఊరట కలిగించారు. నష్టం పూడ్చలేకపోయినా దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందించిన సాయం మాత్రం మరవలేనిది.

**వ్యతిరేక దిశలో వచ్చి..**

1996 నవంబరు 6న తుఫాను సమయంలో 160 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. మచిలీపట్నం వద్ద తీరాన్ని దాటాల్సిన తుఫాను వ్యతిరేక దిశలో కాకినాడను తాకడంతో ఈ విపత్తు సంభవించింది. సముద్ర తీర గ్రామాలైన బలుసుతిప్ప, భైరవపాలెం, పల్లం, ఎస్.యానాం, మొల్లేటిమొగ తుడిచిపెట్టుకుపోయాయి.

1.41 లక్షలు ఎకరాల్లో వరి పంట, 70,847 ఎకరాల్లో కొబ్బరి తోటలు, 11,960 ఎకరాల్లో అరటి, 3,544 ఎకరాల్లో చెరకు, 14,727 ఎకరాల్లో ఉద్యానవన, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. 3.57 లక్ష గృహాలు పాడయ్యాయి. రూ.3,677.29 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అంచనా వేసింది. 34 గ్రామాలు తుఫాను ప్రభావానికి గురికాగా 426 గ్రామాలు దెబ్బ తిన్నాయి. పెనుగాలులకు 1.76 లక్షల హెక్టార్లలో వరి, 12వేల హెక్టార్లలో పత్తి, 8వేల హెక్టార్లలో చెరకు దెబ్బతిన్నాయి. 291 హెక్టార్లలో కొబ్బరి దెబ్బతింది. 245 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్, కమ్యూనికేషన్, వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా పరిశ్రమలు, రైస్‌మిల్లులు, పేపరు మిల్లులు, ఆయిల్ మిల్లులు దెబ్బతిన్నాయి. కోళ్లఫారాలకు విపరీతమైన నష్టం కలిగింది. అప్పటి మంత్రి జీఎంసీ బాలయోగి, ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ప్రజలు తుఫాను నుంచి కోలుకునే వరకు అహరహం శ్రమించారు.


సామర్లకోట భీమేశ్వర ఆలయంలో ఆకాశ దీపపూజలు చేస్తున్న దృశ్యం

## ఘనంగా కార్తీకమాస పూజలు

సామర్లకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):కార్తీకమాస మహాపర్వదినాలు పురస్కరించుకుని కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణ మధ్య అభిషేకాలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవారిని దర్శించారు. మధ్యాహ్నం లక్షపత్రి పూజలలో కాకినాడకు చెందిన విశ్వవీరేశ్వరరావు దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆలయ ధ్వజస్థంభంవద్ద ఆకాశదీప పూజలలోనూ, కార్తీక దీపారాధన సంఘ సభ్యులుచే నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజలలోనూ భక్తులు పాల్గొన్నారు.


హంస వాహనంగా రూపుదిద్దుకొంటున్న పంటు

## సత్యదేవుడి తెప్పోత్సవ పంటుకు మరమ్మతులు పూర్తి

అన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 13న జరగనున్న సత్యదేవుడి తెప్పోత్సవానికి వినియోగించే హంసవాహన పంటుకు మంగళవారం మరమ్మతులు పూర్తిచేసి పండితులు ప్రత్యేకపూజలతో పంపా రిజర్వాయర్ గట్టువద్దకు చేర్చారు. బుధవారం నుంచి హంసవాహనం తయారీ పనులు చేపడుతున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తెలిపారు. ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలతో ఈనెల 10న హంసవాహనం ట్రయిల్‌రన్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# గుర్రప్పాలెంలో ఘోర రోడ్డు ప్రమాదం

● రెండు బైకులు ఢీ ● ఒకరు మృతి ● నలుగురికి తీవ్ర గాయాలు


బైకులు ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రగాయాలతో పడి ఉన్న క్షతగాత్రులు


మృతిచెందిన గోళ్ళ డానియేల్ (ఫైల్)

జగ్గంపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా జగ్గంపేట మండలంలోని గుర్రప్పాలెం గ్రామ శివారున మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఒకరు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే... గుర్రప్పాలెం గ్రామ శివారున ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జగ్గంపేట గ్రామానికి చెందిన గోళ్ళ డానియేల్, మరో నలుగురు వ్యక్తులు జగ్గంపేట నుంచి భావారం వెళ్లారు. అక్కడ ఏలేరు ప్రాజెక్టు సందర్శించి తిరిగి వస్తుండగా జగ్గంపేట నుంచి గుర్రపాలెం వెళ్తున్న మోర్త అప్పన్న, మోర్తసతీష్, యాకోబు ప్రయాణిస్తున్న బైక్‌ను డానియేల్ బైక్ బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే గాయపడ్డ వారిని జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఒక్కరే వైద్యుడు అందుబాటులో ఉండటంతో క్షతగాత్రులు పరిస్థితి వర్ణనాతీతం. విషయం గమనించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించేందుకు అంబులెన్స్‌ల కోసం ప్రయత్నించినా అందుబాటులో లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబం సభ్యులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఆసుపత్రి సిబ్బంది లేకపోవడంతో వాచ్‌మెన్ సెలైన్లు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆసుపత్రిలో వైద్య సేవలు అందే అవకాశం లేకపోవడంతో కుటుంబ సభ్యులు కాకినాడ తరలించేందుకు ప్రయత్నించగా సాయంత్రం 6గంటలకు అంబులెన్స్ వచ్చింది. అంబులెన్స్‌లో కాకినాడ తరలించగా మార్గమధ్యలో గోళ్ళ డానియేల్ (24)మృతి చెందాడు. మోర్త సతీష్, మోర్త అబ్రహం యమగిరి, యాకోబు, సత్తరపు సతీష్‌లు జగ్గంపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు జగ్గంపేట ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు.




ఆసుపత్రిలో నర్సులు లేక క్షతగాత్రులకు సెలైన్ పెడుతున్న వాచ్‌మెన్, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న దృశ్యం



# ఉల్లి..ధర లొల్లి!

● కర్నూలుకు రేటు రాదు ... మహారాష్ట్రకు పోటీ లేదు ● కర్నూలు ఉల్లి అందుబాటులోకి వచ్చినా తగ్గని ధరలు

● కర్నూలు రకం కేజీ రూ.25 లోపే, మహారాష్ట్ర ఉల్లిపాయలు కేజీ రూ.70 పైనే

● మరి కొన్నాళ్లు ధరల భారం మోయాల్సిందే

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఉల్లిపాయల ధరలు మండుతూనే ఉన్నాయి. రోజులు, వారాలు కాదు ఏకంగా నెలల తరబడి రేటు నేలకు దిగిరావడంలేదు. కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్లోకి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినా మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ ఏమాత్రం తగ్గడంలేదు. మరోపక్క షోలాపూర్ రకం కొత్త ఉల్లిపాయలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేయలేకపోతున్నాయి. రైతు బజార్లలో మహారాష్ట్ర ఉల్లిపాయలకు, కర్నూలు ఉల్లిపాయలకు మధ్య రేటు తేడా చూస్తే మహారాష్ట్ర ఎంత డామినేట్ చేస్తుందో అర్థమవుతుంది. రైతు బజార్లలో కర్నూలు రకం కేజీ రూ.26లు ఉంటే, మహారాష్ట్ర పాయలు కేజీ రూ.50ల ధర ఉంది. బహిరంగ మార్కెట్లో నాణ్యత కల్గిన మహారాష్ట్ర ఉల్లిపాయలు కేజీ రూ.60 నుంచి రూ.70 వరకూ విక్రయిస్తుండగా, కర్నూలు పాయలు మాత్రం రూ.25లు దాటకపోవడం గమనార్హం. షోలాపూర్ కొత్తపాయలు కూడా కేజీ రూ.30లోపే ఉన్నాయి. ఉభయగోదావరి, విశాఖపట్నం అర్బన్, కృష్ణా తదితర కొన్ని ప్రాంతాల ప్రజలు మహారాష్ట్ర రకం ఉల్లిపాయలను తప్ప ఇతర రకాలను వినియోగించరని, ఎంత రేటు ఉన్నా వాటినే కొంటారని, దీంతో మహారాష్ట్ర ఉల్లికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు విశ్లేషిస్తున్నారు.

### ● తాడేపల్లిగూడెం మార్కెట్‌కే కర్నూలు పాయలు ...

కర్నూలు రకం ఉల్లిపాయలకు తాడేపల్లిగూడెం హోల్‌సేల్ మార్కెట్ ప్రాచుర్యం పొందింది. ఇక్కడి నుంచే వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు కర్నూలు ఉల్లిని ఎగుమతి చేస్తారు. కర్నూలు ఏరియాలో ఎక్కువగా కాంట్రాక్టు ఫార్మింగ్ ఉంటుంది. దీంతో తాడేపల్లిగూడెంలోని కొంతమంది బడా హోల్‌సేల్ వ్యాపారులు కర్నూలు ప్రాంత రైతులకు ముందుగా అడ్వాన్సులు ఇచ్చి పంట చేతికొచ్చినప్పుడు సరుకును తీసుకొంటుంటారు. సాగుకు ముందే రైతులకు పెట్టుబడి పెట్టడంతో సరుకు డైరెక్టుగా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వస్తోంది. వీటిని ఇక్కడి హోల్‌సేల్ ట్రేడర్లు జార్ఖండ్, ఒడిశా, బీహార్ వంటి ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం ప్రాంతాల్లోని సామాన్య, దిగువ మధ్యతరగతి వర్గాలు ఈ రకం పాయలను ఎక్కువగా వినియోగిస్తారని, మహారాష్ట్రతో పోల్చితే ధర కాస్త తక్కువ కావడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కర్నూలు పాయలకు దిగువతరగతి వర్గాలే టార్గెట్‌గా వ్యాపారం సాగుతుంది. అలాగే జిల్లాలో సంతలు, స్థానికంగా నిర్వహించే చిల్లర మార్కెట్లకు తాడేపల్లిగూడెం మార్కెట్ నుంచి వ్యానుల్లో తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

### ● తొందరగా డ్యామేజీ ... నిలవకు ఆగవు ...

కర్నూలు ఉల్లి తొందరగా డ్యామేజీ అవుతుంది. నిలవకు ఆగదు. మహారాష్ట్ర ఉల్లిపాయలు నెలల తరబడి గొడౌన్లలో నిల్వచేసినా పాడవకుండా ఉంటాయి. కానీ కర్నూలు ఉల్లికి ఆ పరిస్థితి లేదు. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్టే ఆ రోజున్న రేటుకు హోల్‌సేల్ ట్రేడర్లు అమ్మేస్తుంటారు. అందువల్లే మహారాష్ట్ర పాయలను కొన్నంత ధైర్యంగా కర్నూలు పాయలను హోల్‌సేల్ ట్రేడర్లు కొనుగోలు చేయరని, వ్యాపారులకు వ్యాపారం తప్ప పబ్లిక్ ఇంట్రస్టు ఎక్కువగా ఉండదని చెబుతారు. నిజానికి కర్నూలు ఉల్లిపాయ చాలా బాగుంటుంది. ఘాటు ఎక్కువ, రుచి కూడా ఉంటుంది. గ్రేవీ కూడా ఎక్కువ వస్తుంది. కాకపోతే, ఉల్లిపాయ కాస్త ఎరుపు రంగులో ఉండడం, కూర వండిన తర్వాత కూడా కొంచెం ఎరుపుగా కనిపించడంతో చాలా మంది వీటిని ఇష్టపడరు. అలాగే, కర్నూలు పాయ చిన్నగా ఉంటుంది. మనకు ఆనదు. మహారాష్ట్ర నాసిక్ ప్రాంతంలోని ఉల్లిపాయ పెద్దగా ఉండి కంటికి ఆనుతుంది. ఈ విషయం హోల్‌సేలర్లకు తెలుసు కాబట్టి ట్రేడర్లు దీనిపైనే ఎక్కువ దృష్టి పెడతారు.

### ● నాసిక్ ఉల్లి కోసం మరికొన్నాళ్లు ఆగాల్సిందే ..

దీపావళి పండుగ తర్వాత మహారాష్ట్ర కొత్త ఉల్లిపాయలు మార్కెట్లోకి వస్తాయని అంతా భావించారు. హోల్‌సేల్ ట్రేడర్లు కూడా ఇదే చెబుతూ వచ్చారు. ఆమేరకు ఒక్క షోలాపూర్ ప్రాంతం నుం చి మాత్రమే కొత్త ఉల్లిపాయలు మార్కెట్లకు వస్తున్నాయి. మార్కెట్లో మంచి డిమాండ్ కల్గి, ఎక్కువ రోజులు నిల్వ ఉండే సరుకుగా పేరున్న నాసిక్ పరిసర ప్రాంతాల నుంచి ఉల్లి ఎప్పుడు వస్తుందనేది హోల్‌సేల్ ట్రేడర్లు సైతం చెప్పలేకపోతున్నారు. షోలాపూర్ రకం కొత్తపాయలు కావడంతో కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపడంలేదు. ఎందుకంటే నాలుగైదు రోజుల కంటే ఎక్కువ నిల్వ ఉండవు. కర్నూలు ఉల్లితో పోల్చితే కాస్త బెటర్ అనిపించినా షోలాపూర్ ఉల్లి ఆరుదల పాయ కాకపోవడంతో కొనుగోళ్లు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. ఇక కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్‌ను ముంచెత్తినా ధరలను ప్రభావితం చేసే పరిస్థితి లేకపోవడంతో ప్రజలకు ధరాభారం తప్పడంలేదు. అనంతపురం పంట వస్తుందని చెబుతున్నా కచ్చితమైన సమాచారం లేదు. షోలాపూర్ రకం మాదిరిగా అనంతపురం ఉల్లిపాయలు మీడియంగా ఉంటాయని, అవి మార్కెట్లకు వస్తే ధరలు కాస్త అదుపులోకి రావచ్చని భావిస్తున్నారు. గతంలో కర్నాటకలోని కోలార్ జిల్లాలో ఉల్లిసాగు చేసేవారు. అక్కడి రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపడంతో అక్కడి నుంచి ఉల్లిపాయలు మార్కెట్లోకి రావడంలేదు. ఇవన్నీ సామాన్య, దిగువ మధ్యతరగతి ప్రజల ఉల్లి కష్టాలకు కారణంగా మారుతున్నాయి.

**కలెక్టర్ రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నారు ...**

● సునీల్ వినయ్, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి

ఉల్లిపాయలతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను తగ్గించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. జేసీ నేతృత్వంలో ధరల నియంత్రణ కమిటీ ఎప్పటి కప్పుడు మార్కెట్‌ను గమనిస్తూ సమీక్ష చేస్తోంది. ఇప్పటికే రైతు బజార్ల ద్వారా ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతు బజార్లలో ధరలు అదుపులో ఉంటేనే బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించగలం. రేటు తక్కువగా ఉన్న కర్నూలు, షోలాపూర్ పాయలను కూరల్లో ఎక్కువగా వినియోగించాలి. తొందరలోనే మహారాష్ట్ర నాసిక్ రకం ఉల్లిపాయల ధరలు కూడా అదుపులోకి వస్తాయి అని ఆయన పేర్కొన్నారు.

## సెంట్రల్ జైలు జూనియర్ అసిస్టెంట్ అదృశ్యం

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. బాపట్ల జిల్లా నాగారం గ్రామానికి చెందిన మన్నెం విజయ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుగా పనిచేస్తోంది. విజయ కొవ్వూరులోని మెరకవీధి వాటర్‌ట్యాంకువద్ద షేక్ బాషా ఇంటిలో అద్దెకు ఉంటోంది. అక్టోబరు 14వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని జైలు అధికారులు నవంబరు 1వ తేదీన ఇంటికి సమాచారం అందించారు. దీంతో విజయ సోదరి పాగోలు ఉదయభాస్కరమ్మ కొవ్వూరు వచ్చి ఇంటి యజమానిని చెల్లెలు గురించి ఆరా తీశారు. అక్టోబరు 11న ఊరు వెళ్తున్నానిని చెప్పి ఇంటికి తాళంవేసి వెళ్లిందని, తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో ఉదయ భాస్కరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

## భోజనం దగ్గర వివాదం

● ఒకరి హత్య

మోతుగూడెం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): భోజనం విషయంలో ఇద్దరి మధ్య జరిగిన వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. ఈ ఘటన మంగంపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మరిగెల అబ్బాయిరెడ్డి(41) దెబో చికెన్ షాపులో పనిచేస్తాడు. ఈనెల మూడున అక్కడ భోజనానికి అన్నం లేకపోవడంతో గ్రామంలో ఉన్న సోదరి నైని లక్ష్మి ఇంటికి వెళ్లాడు. ఆ ఇంట్లో అన్నం లేకపోవడంతో పక్కనే ఉంటున్న ఆమె కుమారుడు వెంకటరెడ్డి ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయానికి వెంకటరెడ్డి, ఆయన భార్య ఇంట్లో లేరు. అన్నం ఉండడంతో అబ్బాయిరెడ్డి తింటున్నాడు. ఇంతలో వచ్చిన వెంకటరెడ్డి ఆగ్రహంతో పీట తీసుకుని అతడి తలపై బలంగా కొట్టాడు. అబ్బాయిరెడ్డిని చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అబ్బాయిరెడ్డి మంగళవారం మరణించాడు. కేసును చింతూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చింతూరు ఆసుపత్రిలో పసిబిడ్డ మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు

● ఐటీడీఏ ముందు బైటాయింపు


పసి బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమేనంటూ ఐటీడీఏ ముందు బైటాయించిన తల్లిదండ్రులు

చింతూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చదలవాడకు చెందిన కలుముల దుర్గారావు, బుల్లెమ్మల ఐదునెలల పసిబిడ్డ మంగళవారం అల్లూరి జిల్లా చింతూరు ఏరియా ఆసుపత్రిలో మృతి చెందింది. దుర్గారావు దంపతుల బిడ్డ అస్వస్థతకు గురవడంతో సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. మంగళవారం ఆ పసిబిడ్డ మృతి చెందింది. దీంతో ఆగ్రహానికి గురైన దుర్గారావు దంపతులు మృతి చెందిన తమ బిడ్డతో సహా ఐటీడీఏ కార్యాలయం ముందు బైటాయించారు. దుర్గారావు వెల్లడించిన వివరాలు.. తమ బిడ్డ అస్వస్థతకు గురవడంతో సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చామన్నారు. స్థానికంగా మెరుగైన చికిత్స అందించలేని పక్షంలో తమ బిడ్డను భద్రాచలం తరలించాల్సిందిగా వైద్యులను కోరామన్నారు. అవసరం లేదని ఇక్కడనే చికిత్స అందిస్తామని వైద్యులు చెప్పారని అన్నారు. చివరకు తమ బిడ్డ మృతి చెందిందన్నారు. సకాలంలో భద్రాచలం తరలించినట్లైతే బిడ్డ బతికేదని దుర్గారావు వాపోయాడు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ బాధితులతో మాట్లాడారు. పూర్తి వివరాలు సేకరించి నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకుంటానని తల్లిదండ్రులకు నచ్చ చెప్పారు.


మృతి చెందిన 5 నెలల పసిబిడ్డ

దీంతో బాధితులు దీక్ష విరమించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఐటీడీఏ వాహనంలో చదలవాడకు పీవో ఆదేశాల మేరకు సిబ్బంది తరలించారు.

### తక్షణం సర్వే మొదలు పెట్టండి

● వైద్యశాఖకు ఐటీడీఏ పీవో ఆదేశాలు

పసిబిడ్డ మృతితో చింతూరు ఐటీడీఏ పీవో స్పందించారు. ఈ మేరకు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యకు పీవో పలు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో బాగంగా చింతూరు డివిజన్ లో బుధవారం నుంచి ఇంటింటా సర్వే చేపట్టాల్సిందిగా ఆదేశించారు. చలి కాలం వచ్చినందున ఏడాదిలోపు బిడ్డల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీయాలన్నారు. ఏ ఒక్కరి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోయినా వారిని తక్షణమే ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలన్నారు. మరణాలు సంభవించకూడదన్నారు. ప్రతి సచివాలయంలో తన (ఐటీడీఏ పీవో)మొబైలు నెం. డిస్‌ప్లే చేయాలన్నారు. ఆరోగ్య స్థితిగతుల విషయంలో ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే తనకు ఫోన్ చేయాల్సిందిగా పీవో ప్రజలను కోరారు.

### ● మృతిపై విచారణ

చింతూరు ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఐదు నెలల పసిబిడ్డ మృతి చెందింది. ఈ మేరకు స్పందించిన పీవో ప్రకటన విడుదల చేశారు. మృతికి కారణాలను ఆరా తీస్తున్నామన్నారు. వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు స్పష్టమైతే చర్యలు తీసుకుంటామన్నారు.

# వ్యాన్ నుంచి భారీగా మంటలు

● వ్యాన్ దగ్ధం ● డ్రైవర్ సహా నలుగురు క్షేమం


ఆలమూరులో మెయిన్‌రోడ్డులో దగ్ధమవుతున్న బొలెరో వ్యాన్

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్‌రోడ్డులో ప్రయాణిస్తున్న వ్యాన్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఓఎన్జీసీకి చెందిన బొలెరా వ్యాన్ జొన్నాడ నుంచి పెదపళ్ల వద్ద ఉన్న జీసీఎస్ వద్ద వెళుతుండగా ఆలమూరు బ్యాంక్ సెంటర్ దాటగానే ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో వ్యాన్‌లో డ్రైవర్‌తో సహ నలుగురు ప్రయాణిస్తున్నారు. మంటలను గమనించిన వారు వ్యాన్ నుంచి దిగిపోవడంతో రోడ్డుపై వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. ఆ ప్రాంతం నుంచి కొంత ముందుగా వ్యాన్ నుంచి ఆయిల్ లీక్ అయినట్లుగా స్థానికులు చెబుతున్నారు. వ్యాన్ దగ్ధమవుతున్న సమయంలో మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను అదుపుచేసి ప్రమాదం వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. మండపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని వ్యాన్ మంటలు అదుపు చేసిన తరువాత ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు.

## గిరిజన ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్

రంపచోడవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలోని స్వయం సహాయక సంఘాలు, గిరిజన ఉత్పత్తులకు ఆన్‌లైన్ గ్లోబల్ మార్కెటింగ్ సదుపాయం కల్పించే విధంగా ఓపెన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసినట్లు వెలుగు ఐటీ మేనేజర్ లంకే రామరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గిరి జన ప్రాంతంలో గిరిజనులు, డ్వాక్రా మహిళలు వివిధరకాల వస్తువులు, వెదురుఉత్పత్తులు, అల్లికలు, మిల్లెట్స్, చీపురు, పచ్చళ్లు తదితర వస్తువులు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ తరహాలో మై స్టోర్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో అమ్ముకొనే విధంగా సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వస్తువుల వివరాలతో పాటు ఆధార్, పాన్, బ్యాంక్ ఎకౌంట్ వివరాలతో సమీపంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయం, రంపచోడవరం, టీపీఎం యూ హెడ్ క్వార్టర్ కార్యాలయంలో ఉచితంగా ఈకామర్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం, గిరిజన, డ్వాక్రా ఉత్పత్తులకు ఆదాయం సమకూరుతుందన్నారు.

# ఆరుకు చేరిన మృతుల సంఖ్య

● సూర్యారావుపాలెంలో బాణసంచా ఘటనలో మరో ముగ్గురు మహిళలు మృతి

పెంటపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత నెల 30వ తేదీన ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన దుర్ఘటనలో మృతుల సంఖ్య 6కు చేరింది. సంఘటనా స్థలంలోనే వేగరౌతు శ్రీవల్లి, గుమ్మడి సునీత మృత్యువాత పడగా రెండురోజుల తరువాత ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరావు మృతి చెందాడు. సోమవారం రావిపాడు గ్రామానికి చెందిన శీలం లక్ష్మి(45), మందలంక కమలరత్నం (47), దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారి(53) ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శీలం లక్ష్మికి భర్త దుర్గారావు, కుమార్తె ఉండగా కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారికి భర్త లేడు. ఒక కుమారుడు మాత్రమే ఉన్నాడు.



# తక్కువ ధరకే బంగారమంటూ మోసం

» షిర్డీ మ్యూజియంలో పనిచేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు.. కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇస్తానని చెప్పి డబ్బు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం పాత పట్టిసీమకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నారపురెడ్డి కనకయ్య మధురపూడి ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. 2023 జూలై 6న కుటుంబ సభ్యులతో షిర్డీ వెళ్లాడు. అక్కడి మ్యూ జియంలో పనిచేస్తున్న అల్లాడి కునాల్ కశ్యప్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి కనకయ్య భార్య వరలక్ష్మిని కశ్యప్ అక్కా అని పిలిచేవాడు. 2024 ఫిబ్రవరి 6న పట్టిసీమ ఇంటికి వచ్చి వధువు ఫొటోలు చూపించి పెళ్లి కుదిరిందని చెప్పి 2 వారాలు ఇంట్లో ఉన్నాడు. విదేశాల్లో కొంత బంగారం తక్కువ ధరకు లభించిందని, దానికి సంబంధించి సెక్యూరిటీ డిపాజిట్లు చెల్లించాలని, బంగారానికి రూ.4,80,000 దఫదఫాలుగా ఫోన్‌పే ద్వారా ఎస్‌బీఐ అకౌంట్‌కి, బైక్‌కి సంబంధించి కొవ్వూరు బజాజ్ షోరూంలో రూ.86,000 చెల్లించారు. ఎంతకి బంగారం గాని, బైక్ గాని, ఇవ్వకపోవడంతో తీసుకున్న డబ్బు ఇవ్వాలని ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం చెప్పడం లేదన్నారు. విశాఖపట్నం ఆదిత్య ఆసుపత్రిలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లి కనకయ్య విశాఖపట్నం ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు జీరో ఎఫ్‌ఐ ఆర్ నమోదు చేసి కేసును కొవ్వూరు రిఫర్ చేశా రు. దీనిపై కొవ్వూరు పట్టణ ఎస్‌ఐ కె.జగన్మోహనరావు మరలా కేసునమోదు చేసినట్టు తెలిపారు.


బండ అటవీ ప్రాంతంలో పులి పాదముద్ర

# సరిహద్దు దాటిన పులి

●అక్కడి నుంచి ఇక్కడకు - ఇక్కడి నుంచి అక్కడకు ● కారిడార్ విస్తరణ పనిలో నిరంతర కూంబింగ్‌లతో అంతరాయం? ●ఛత్తీస్‌గడ్‌లో రెండు ఆవులపై దాడి

చింతూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షంగా పరోక్షంగా కన్పించిన పులి ఇరవై రోజులపాటు గిరిజనులను వణికించింది. అంతేకాదు నాలుగు ఆవులను కాపు కాచి చం పింది. ఇప్పుడు చింతూరు అటవీ డివిజన్ దాటి సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గడ్‌లో అడుగు పెట్టింది. అంతేకాదు సోమ వారం అక్కడ రెండు ఆవులను వేటాడింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో అలజడి మొదలైంది. అక్కడ కూడా పులి ప్రధాన రహదారిని ఆనుకుని సంచరించడం గమనార్హం. ఆ క్రమంలోనే కొందరి కంట పడింది. విషయం అటవీ అధికారులకు చేరింది. దీంతో అక్కడి అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. సుక్మా డీఎఫ్‌వో అశోక్‌పటేల్ ఆదేశా లతో సిబ్బంది పులి పగ్‌మార్క్స్ (పాదముద్రలు) సేకరించారు. ఎనిమిది నుంచి తొమ్మిది అంగుళాల వరకు ఉన్నట్లు నిర్ధారణకొచ్చారు. కూనవరం అటవీ పరిధిలో సంచరించిన పులి పాదముద్రలు కూడా అవే కొలతలు కలిగి


పులి దాడిలో మృతి చెందిన ఆవు

ఉన్న విష యం విదితమే. దీంతో మన ప్రాంతం నుంచి అక్కడకు చేరినట్లు అక్కడి అటవీ అధికారులు అంచనాకొచ్చారు. కూనవరం అటవీ పరిధిలో 40 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసినప్పటికీ పులి కదలికలు కెమెరాలో చిక్కని విషయం కూడా తెల్సిందే. దాదాపు పదిహేనేళ్ల క్రితం కూనవరం, వరరామ చంద్రపు రం మండలాల అటవీ ప్రాంతంలో పులి సంచరించింది. ఇన్నేళ్లకు మళ్లీ ప్రత్యక్షమైంది. చింతూరు డివిజన్‌తో పోల్చితే సుక్మా డివిజన్ లో అటవీ ప్రాంతం దట్టంగా ఉంటుంది. దీంతో పులుల సంచారం అక్కడ కొత్తేమీకాదు. అయితే ఇటీవల కాలంలో దండకారణ్యంలో మానవ సంచారం అధికమైంది. మావోయిస్టుల అణచివేత లక్ష్యంగా అంతర్యుద్ధం సాగుతోంది. ఇందులో భాగంగా దండకారణ్యంలో ప్రతి ఐదు కిలోమీటర్ల దూరంలో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. అదే దశలో అటవీ గ్రా మాలకు రహదారులు, వంతెనల పనులు ము మ్మరంగా చేస్తున్నారు. అనంతరం దండకార ణ్యంలో మునుపెన్నడూ లేని విధంగా మానవ సంచారం పెరిగింది. ఇది వణ్య ప్రాణుల స్వేచ్ఛకు అంత రాయం కలిగిస్తోందన్న వాదన ఉంది. దీంతో పులితో పాటు ఇతర అటవీ జంతువులు సుర క్షిత ప్రాంత అన్వేషణలో పడి ఉంటాయన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి. పులి విస్తారంగా సంచరించడం కూడా ఇందులో భాగ మేనంటున్నారు. వణ్యప్రాణి ప్రేమికుల అధ్య యనం మేరకు ఒక పులి తన సామ్రాజ్యాన్ని (కారిడార్) అటవీ ప్రాంతంలో 60నుంచి 100 కిలోమీటర్ల మేర వైశాల్యాన్ని ఎంపిక చేసుకుం టుంది. ఈ మేరకే పులి తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతంలో తన కారిడార్ ఎంపిక కోసం సంచరిస్తుందన్న ప్రచారం సాగుతోంది.

## నిత్యం ప్రజల్లోనే ఉంటా

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలో మంగళవారం 1 నుంచి 15 డివిజన్లకు సంబంధించి శీలం నూకరాజు కాంప్లెక్స్ సమీపంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్దఎత్తున ప్రజలు హాజరై ఎమ్మెల్యేకు స్వయంగా సమస్యలను విన్నవించారు. ప్రజాదర్బార్ ద్వారా వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభ్యసనా సామర్థ్యాలను సాధించాలి

కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం



శిక్షణా కేంద్రాన్ని సందర్శిస్తున్న సీఎంవో సుబ్రహ్మణ్యం

దివాన్‌చెరువు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):ప్రాథమిక స్థాయి విద్యార్థులు తరగతి వారీగా కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించాల్సిన అవసరం ఉందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్రశిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. రాజానగరం మండలం కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ గ్రేడ్-1 విద్యార్థులు తప్పనిసరిగా తెలుగు, గణితం సబ్జెక్టులలో ప్రాథమిక భావనలను అభ్యసించవలసిన అవసరం ఉందన్నారు. 2026 నాటికి 1,2 తరగతుల విద్యార్థులందరికీ కనీసం చదవడం, రాయడం పూర్తిగా రావాలనే ఉద్దేశ్యంతోనే ప్రాథమిక విద్యాబోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. శిక్షణా కేంద్రం కోర్సు డైరెక్టరు, ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్యనందించేందుకు ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్ మాట్లాడుతూ శిక్షణాకేంద్రంలో నూరుశాతం హాజరు నమోదు ఉందన్నారు.

## సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలి

సోషల్ మీడియా ఇన్ఫ్లుయేన్సర్లతో సమావేశంలో ఎస్పీ కిషోర్



సోషల్ మీడియా ఇన్ఫ్లుయేన్సర్లతో మాట్లాడుతున్న ఎస్పీ కిషోర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):సోషల్ మీడియా ఇన్ఫ్లుయేన్సర్లు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ సూచించారు. జిల్లాలోని ఫేమస్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయేన్సర్లతో మంగళవారం రాజమహేంద్రవరంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాను ప్రభావితం చేసే అంశాలపై అవగాహన కలిగించే అంశాల పట్ల వాస్తవాలు ప్రజలకు తెలియజేసే వాటిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్‌పై ముఖాముఖీ చర్చించారు.

## ఐపీఏ రాష్ట్రాధ్యక్షుడిగా ఆదిరెడ్డి



మహిళాధ్యక్షురాలిగా దివ్య



అనపర్తి నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా నల్లమిల్లి ఆదిరెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా సత్తి దివ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా నాలుగోసారి వీరిద్దరూ ఈ పదవులకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. అలాగే వీరిద్దరూ అనపర్తికి చెందిన వారు కావడం మరో విశేషం. ఈ సందర్భంగా నల్లమిల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ ఏపీ కార్యవర్గంలో తమతో బాటు బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన పిడక లక్ష్మణగాంధీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగాను బలభద్రపురం గ్రామానికి చెందిన నల్లమిల్లి అనిల్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర కోశాధికారిగా నియమిస్తూ జాతీయ జనరల్ సెక్రటరీ అభయ్ కుమార్ ప్రకటించినట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ఫార్మాసిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. అనేక సమస్యలపై ఇప్పటికే పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు ప్రముఖులు అభినందించారు.

## డిమాండ్లను నెరవేర్చాలని 104 సిబ్బంది వినతి



వైద్యాధికారిణికి వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

రంగంపేట,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రంగంపేట 104 సిబ్బంది స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిణి బీవీ శ్రీలక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్మును తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో 104 సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, డ్రైవర్ గొర్రెల కాంతారావు, డేటాఎంట్రీ ఆపరేటర్ బత్తిన అనిల్‌కుమార్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని పెదరాయవరంలో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు చాకచక్యం, పవన్‌కళ్యాణ్ నిక్కర్చితత్వం, నరేంద్రమోదీ ముందుచూపు కారణంగా ఏపికి అనేక నిధులు కేంద్రం నుంచి సమకూరుతున్నాయన్నారు. డబుల్‌ఇంజన్ సర్కార్ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా రాష్ట్రానికి సహాయం అందిస్తోందన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12 వేల కోట్లు, రైల్వే ప్రాజెక్టుకు రూ.9 వేల కోట్ల సహాయం అందిస్తోందన్నారు. అలాగే విజయవాడ, విశాఖపట్నంలలో ఆగిపోయిన మెట్రోరైలు నిర్మాణ పనులు చేపడుతుందన్నారు. అలాగే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, పోతుల వెంకట్రావు, మోదుకూరి గోపాలకృష్ణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో నాగులచవితి

» పాముపుట్టల వద్ద భక్తుల సందడి
» కలుగుల్లో పాలుపోసి పూజలు
» చిమ్మి, వడపప్పు నివేదన
» బాణసంచా కాల్పులు



ధవళేశ్వరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు/రాజానగరం/దివాన్‌చెరువు/గోకవరం/సీతానగరం/అనపర్తి/కోరుకొండ/ధవళేశ్వరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండగను ప్రజలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు వేకువజామునే లేచి పవిత్రస్నానాలను ఆచరించిన అనంతరం పొలాల వెంబడి ఉన్న పుట్టల వద్దకు వెళ్లి పుట్టను పరిశుభ్రం చేసి, చుట్టూ ముగ్గులు వేసి, రంగురంగుల పువ్వులతో అందంగా అలంకరించారు. అనంతరం పుట్టకలుగుల్లో పాలు, తేగలు, గుడ్లు, చలిమిడి, చిమ్మి, వడపప్పు, బుర్రగుంజు, పసుపు, కుంకుమలు వేసి పూజలు చేశారు. ఆపై పుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, చిన్నారులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కొందరు నాగుల తువ్వాళ్లను పుట్టలపై కప్పి తిరిగి తమ భుజాలపై ధరించారు. మరికొందరు పుట్టల వద్ద వన భోజనాలతో సందడిగా గడిపారు. సీతానగరం డిగ్రీ కళాశాలలో పుట్టలు ఎక్కువగా ఉండడంతో అధిక సంఖ్యలో భక్తులు కళాశాల వద్ద పూజలు చేసి పుట్టలో పాలు పోసుకున్నారు. ముగ్గళ్ల, సీతానగరం గ్రామాల్లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనపర్తిలోని వీర్రాజు మామిడి వద్ద సుబ్రహ్మణ్యే శ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పాముల పుట్ట వద్దకు అధిక సంఖ్యలో భక్తులు చేరి పూజలు చేసి కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో వద్ద షష్ఠి వేడుకల సందర్భంగా ముద్రించిన పోస్టర్లను దాతలు ఆవిష్కరించారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు తమలంపూడి వీర్రాఘవరెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, మండ పోతారెడ్డి, మండ రామారెడ్డి, తేతలి వీర్రెడ్డి, వెలగల గంగిరెడ్డి పాల్గొన్నారు. కోరుకొండలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం, గాదరాడ ఓం శివశక్తి పీఠం, గుమ్ములూరు, కణుపూరులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కోరుకొండ ప్రభుత్వాసుపత్రి సమీపంలోని చల్లా శంకర్రావు లేఅవుట్‌లో అమ్మ వారి గద్దె వద్ద పుట్టకు భక్తులు పూజలు చేశారు. ధవళేశ్వరంలో అగస్త్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, బ్యారేజ్ కాలనీ రామాలయం వద్ద ఉన్న దానవాయిబాబా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు.



రాజానగరంలో పుట్టకు పూజలు చేసి నమస్కరిస్తున్న భక్తులు

### గ్రంథాలయ వారోత్సవాలపై సమీక్ష

నల్లజర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాను నిర్వహించేందుకు అభివృద్ధి కమిటీ చైర్మన్ గుదే సుశీల అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణ, విద్యార్థులతో వివిధ రంగాల్లో పోటీలు నిర్వహించాలని కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీరామమూర్తి, తాడి రమేష్ పాల్గొన్నారు.

### కందుకూరి రాజ్యలక్ష్మికి నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి 174వ జయంతి ని మంగళవారం ఆనంద గార్డెన్స్‌లోని కందుకూరి వీరే శలింగం దంపతుల సమాధి వద్ద నిర్వహించారు. సమాధులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. వ్యాస రచన పోటీల్లో విజయం సాధించిన ఎంబీఏ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హితకారిణి సమాజం అసిస్టెంట్ కమిషనర్ జె.వినోద్‌కుమార్ , ఎస్‌కెఆర్ బీఏ, డీఈడీ కళాశాల అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### మాజీ ఎంపీ భరత్‌రామ్‌పై టీడీపీ నాయకుల ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 5( ఆంధ్రజ్యోతి): సత్యదూరమైన ప్రచారాలు చేస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన భరత్ రామ్‌పై చర్యలకు టీడీపీ నాయకులు యిన్నమూరి దీపు, నల్లం శ్రీను, బుడ్డిగ రవి, చాపల చిన్నరాజు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ అప్పారావుకు మంగళవారం ఫిర్యాదు అందించారు. కూటమి ప్రభుత్వంపై సత్యదూరమైన ప్రచారాలు చేస్తే ఊరుకోబోమని అన్నారు.

### ఘనంగా గౌడ శెట్టిబలిజ వనసమారాధన

దివాన్‌చెరువు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసంసందర్భంగా దివాన్‌చెరువులో మంగళవారం గౌడ శెట్టిబలిజ వనసమారాధన జరిగింది. స్థానిక ప్రముఖులు వంక సత్యనారాయణ, మల్లిబాబు, సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, రాష్ట్రకార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, ప్రముఖ వైద్యుడు గూడూరి శ్రీనివాస్ తదితర నాయకులు విచ్చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై వనభోజనాలు చేశారు. అలాగే అయ్యప్ప స్వాములు, శివస్వాములకు ఇరుముడి మీద వస్త్రదానం చేసినట్టు మల్లిబాబు తెలిపారు.

### నిడిగట్లలో రీ సర్వేపై గ్రామసభ

కోరుకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నిడిగట్ల గ్రామ సచివాలయం వద్ద మంగళవారం తహశీల్దార్ సుస్వాగతం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే సందర్భంగా తలెత్తిన భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దార్ రైతులకు సూచించారు. సమావేశంలో రీ సర్వే డీటీ అంబటి రజని, వీఆర్వో ఎం.నాగరత్నం, నాయకులు వల్లభశెట్టి సుబ్బారావు, బండారు అచ్చారావు, మేడిశెట్టి శివరాం తదితరులు పాల్గొన్నారు.

### అన్న సమారాధనకు రూ.50 వేలు విరాళం

కోరుకొండ, నవంబరు5(ఆంధ్రజ్యోతి): కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక అన్న సమారాధనకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి మంగళవారం రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అన్న సమారాధనకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు రూ.25 వేలును నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయార్చకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పదో తరగతి బయాలజీ మెటీరియల్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, నంబరు 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల కోసం జిల్లా బయాలజీ ఫోరమ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు ఆవిష్కరించారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని డీఈవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎంఈవో కుశలవదోర, ప్రధానోపాధ్యాయులు సంఘం ప్రతినిధులు రమణరావు, గణపతి, జిల్లా బయాలజీ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస నెహ్రూ, ప్రధాన కార్యదర్శి సుధారాణి, ఉపాధ్యాయులు వీరబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

### నిరక్షరాస్యులకు సాధికారత కల్పించడమే ఉల్లాస్ లక్ష్యం

ఎంపీడీవో శ్రీనివాస్

బిక్కవోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 ఏళ్ల, పైబడిన నిరక్షరాస్యులందరికీ సాధికారత కల్పించడమే ఉల్లాస్ లక్ష్యమని ఎంపీడీవో వి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉల్లాస్ (సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన) కార్యక్రమంపై వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులందరికీ చదవడం, రాయడం, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలతో క్రియాత్మక అక్షరాస్యతను అందించి జీవితకాల అభ్యాసాన్ని పెంపొందిస్తామన్నారు. మండలంలో పది మందికి ఒక వలంటీరు విద్య నేర్పుతారన్నారు. మండలంలో 71 మంది వలంటీర్లను వెలుగు ప్రాజెక్టు వారు ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ త్రిమూర్తులు, ఎస్‌వో ఆనంద్, పరిపాలనాధికారి రత్నకుమార్, ఏపీఎం సుప్రియ, ఎంఈవో సీహెచ్‌వీవీ. సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పంటల బీమా వినియోగించుకోవాలి

ఉద్యాన, వ్యవసాయాధికారులు సుధీర్‌కుమార్, భీమరాజు



పంటల బీమా పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్,నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి డి.సుధీర్‌కుమార్, వ్యవసాయాధికారి భీమరాజు తెలిపారు. పిడింగొయ్యి, శాటిలైట్ సిటీ (మోరంపూడి రెవెన్యూ) గ్రామాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజను 2024-25 జీడిమామిడి పంట బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమాలో భాగంగా అమలవుతున్న ఈ పథకంలో ఖరీఫ్‌లో అరటి, రబీలో జీడిమామిడి పంటలకు బీమా సదుపాయం కల్పించారన్నారు.జిల్లాలో జీడిమామిడి పంటలకు బీమా పొందేందుకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ కంపెనీలను ఎంపిక చేశారన్నారు. మూడేళ్ల దాటిన పంటలకు ఎకరాకు రూ.1500 చెల్లిస్తే రూ.30 వేలు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి పీటర్, హర్టీకల్చర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్ రైతులు పాల్గొన్నారు.

### సాగులో నూతన పద్ధతులపై అవగాహన



నూతన సాగు పద్ధతులను వివరిస్తున్న విద్యార్థినులు

రంగంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వ్యవసాయం ఎంతో తోడ్పాటునిస్తుందని ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా, నైరా వ్యవసాయ కళాశాల అధ్యయన విద్యార్థినులు రంగంపేట సొసైటీ ఆవరణలో రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన అధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక చిత్రపటం వివరణ అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రామంలో రైతులు ఆచరిస్తున్న సాగు పద్ధతులను తెలుసుకుంటూ, నూతన పద్ధతులను వివరించారు. కాగా గ్రామాల్లో అధిక మోతాదులో ఎరువులు,పురుగుమందులు వాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేతలు సీహెచ్ఎన్‌వీ నరసింహారావు, ఎం.శ్రీనివాసరావు, ఏవో కె.శ్రీనివాస్, ఉండవిల్లి గిరిబాబు, గారపాటి రాంబాబు, మండవిల్లి గుప్త పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి న్యాయం చేయండి

బార్ అసోసియేషన్‌కు బీసీ సంఘం నాయకుడు మూర్తి వినతి



వినతిపత్రం అందచేస్తున్న మూర్తి

కడియం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బుర్రిలంకలో జరిగిన హత్యాచార ఘటనలో నిందితులకు బెయిల్ కోసం కేసును వాదించకుండా తీర్మానం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది డీవీవీ సత్యనారాయణమూర్తి కోరారు. ఈ మేరకు రాష్ట్ర బార్ అసోసియేషన్‌కు, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్‌కు, ట్రెజరర్ కర్రి హనుమంతరావు, కల్చరల్ సెక్రటరీ కాశీ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. బెయిల్ కోరుతూ కొందరు న్యాయవాదులను సంప్రదిస్తున్నట్టు తెలుస్తోందని, నిందితులు బెయిల్‌పై విడుదలైతే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. న్యాయవాదులు సంఘం బాధిత కుటుంబానికి మానవతా ధృక్పథంతో న్యాయం చేయాలని సత్యనారాయణమూర్తి కోరారు.

### బీజేపీ నాయకురాలి పరామర్శ

బుర్రిలంకలో హత్యాచార బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక పరామర్శించారు. గంజాయి మత్తులో యువకులు వివాహితపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎంపీ పురందేశ్వరి ఇప్పటికే పోలీసులకు సూచించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, సుంకర బాలు, మజ్జి శివ, గంగుమళ్ల గోవిందు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజల ఉపాధి కల్పనకు కృషి

నైపుణ్య గణనపై అవగాహన, శిక్షణ తరగతుల్లో ఎంపీడీవో ఝాన్సీ

రాజానగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులైన మహిళలు, పురుషులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీవో జేప ఝాన్సీ పేర్కొన్నారు. మండలంలో త్వరలో చేపట్టనున్న గణన సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సంక్షేమ విద్యా సహాయకులకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ త్వరలో గ్రామాల్లో ప్రతి ఇంటిని సచివాలయ సిబ్బంది సందర్శించి 15 నుంచి 50 ఏళ్ల వయసున్న వారిని సర్వే చేసి, వారి వృత్తి వివరాలతో పాటు నైపుణ్య వివరాలు నమోదు చేస్తారని, అనంతరం వారికి ఆసక్తి ఉన్న రంగంలో ఉచిత శిక్షణ ఇచ్చి, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. మండల పరిషత్ పరిపాలనాధికారి ఎం.సుబ్రహ్మణ్యం, పంచాయతీ విస్తరణాధికారి వాణి, సచివాలయ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించారు.

### ఓటు నమోదు చేసుకోవాలి

కోరుకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో మంగళవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం వద్ద పట్టభద్రుల ఓటు నమోదు వేగవంతం చేయాలి. ఈ మేరకు పలువురు పట్టభద్రులు జనసేన పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి ఓటు నమోదుకు సంబంధించిన దరఖాస్తులు అందజేశారు. ఈ నెల 6తో పట్టభద్రుల ఓటు నమోదు గడువు ముగుస్తున్నందున మండలంలోని పట్టభద్రులందరూ ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ కార్డు, డిగ్రీ పట్టా జిరాక్స్‌లు, పాస్‌పోర్ట్ సైజుఫొటో జనసేన పార్టీ కార్యాలయం వద్దఅందజేసి తమ ఓటునమోదు చేయించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

### జాతీయ యోగా పోటీలకు అజీస్ ఎంపిక



రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా దర్గామిట్టలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14, 17 బాలుర జట్లలో కొంతమూరు జడ్పీ హైస్కూల్ టీమ్ ప్రథమ స్థానాలు సాధించింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్‌కే అజీస్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల హెచ్ఎం బి.రత్నకళ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. పీడీ టి.సుజాతను అభినందించారు.

### వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలి

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి విస్తరణాధికారులు తోడ్పడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు అన్నారు. జిల్లాలో వ్యవసాయ సహాయకుల నుంచి వ్యవసాయ విస్తరణాధికారులుగా పదోన్నతి పొందిన వ్యవసాయ విస్తరణాధికారులు మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి మాధవరావును మర్యాదపూర్వకంగా కలిసారు. వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, అంకిత బావంతో పనిచేయాలని డీఏఓ మాధవరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విస్తరణాధికారుల సంఘం అధ్యక్షులు వేణుమాదవరావు, ఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు మీసాల మాధవరావు తదితరులు ఉన్నారు.

### విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపుపై నిరసన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 5 ,( ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులో సర్దుబాటు చార్జీల పెంపును నిరశిస్తూ రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ బిల్లులు సర్దుబాటు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, డాక్టర్ వడయార్, ఎం.శారద , చింతాడ వెంకటేశ్వరరావు, మేడవరకు భద్రందొర, అబ్దుల్లా షరీఫ్, బత్తిన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులకు పింఛన్లు అందజేత

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ గత 14 ఏళ్లగా వృద్ధు లకు పింఛన్లు, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం అభినందనీయమని ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు అన్నారు. ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణం ఆనంద్ గార్డెన్స్‌లో మంగళవారం వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 80 మంది వృద్ధులకు రూ.500 చొప్పున రూ.40 వేలు పింఛన్లు పంపిణీ చేశా రు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ పోలాకి పరమేష్, డైరెక్టర్ ముగిడి శ్రీనివాసరావు, రిటైర్డ్ టీచర్లు పడాల సత్యనారాయణ రెడ్డి, కడలి సుశీల దంపతులు. క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు, కార్యదర్శి గుబ్బల గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.


### సీఎంను కలిసిన శేషారావు

నిడదవోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని మంగళవారం అమరావతిలో నిడదవోలు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు కలి శారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభి వృద్ధి, పార్టీ సభ్యత్వ నమోదుపై సీఎం చంద్రబాబుకు తెలిపినట్టు ఆంధ్రజ్యోతికి ఆయన తెలిపారు.

### టెండరు కం బహిరంగ వేలం ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కుదుపూరు గ్రామంలో గల శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఆలయం సంపూర్ణ హక్కు భుక్తములో గల తూర్పు గోదావరి జిల్లా, అనపర్తి మండలం అనపర్తి గ్రామం సర్వే నెంబరు 146/9లో గల 0.94 సెంట్లు మెరక భూమిలో సొంతఖర్చులతో మట్టిని త్వవ్వుకుని తీసుకొని పోవుహక్కునకు ది.12-11-2024 తేదీన మంగళవారం ఉదయం 11 గంటలకు అనపర్తి గ్రామ సచివాలయం-1 వద్ద దేవదాయశాఖ అధికారుల సమక్షమున బహిరంగవేలం వేయబడును. ఈ పాటలో పాల్గొనేవారు 25,000/- ప్రథమ ధరావత్తు సొమ్ము చెల్లించి సాల్వేన్సీ 5,00,000/-లకు పాటకు ముందు సర్టిఫికేట్ సమర్పించవలెను. మిగిలిన ముఖ్య షరతులు కర పత్రముల ద్వారా తెలియపరచబడును. మిగిలిన వివరాలు కార్యనిర్వాహణాధికారి వారిని, సెల్: 9398656919 అడిగి తెలుసుకోవలెను.

కార్యనిర్వహణాధికారి



## కాపాడమ్మా.. నాగమ్మా..



బిక్కవోలు,నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగ మ్మా.. కాపాడమ్మా అంటూ భక్తజనం మొక్కుకున్నారు. ఊరూవాడా నాగుల చవితిని ఘనంగా చేసుకున్నారు. పట్టణాల్లో పాము పుట్టలను వెతుక్కుంటూ వెళ్లి కలుగుల్లో పాలు, గుడ్లు వేసి మొక్కుకున్నారు.. తేగలు వేశారు.. చిమిలి, చలిమిడి వడపప్పు సమర్పించారు.. పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా పెద్దా అందరూ కుటుంబ సమేతంగా పండుగను ఘనంగా చేసుకున్నారు. పుట్టల వద్ద బాణసంచా కాల్చి ఆనందంగా గడిపారు. నాగులచవితి సందర్భంగా సహజమైన పుట్టతో దర్శనమిచ్చే బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయానికి భక్తజనం పోటెత్తారు.నాగుల చవితి, సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు మంగళ వారం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ ఎమ్మెల్యే దంపతులకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ, కొడమంచిలి సత్యనారాయణశర్మలు ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వచనాలు అందజేశారు.



కొవ్వూరులో పుట్టవద్ద పూజలకు హాజరైన కుటుంబం
బిక్కవోలులో ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతుల పూజలు

## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : దుర్గేష్

ఉండ్రాజవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాడిపర్రులో మృతుల కుటుంబాలను ఆదుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన మారిశెట్టి మణికంఠ, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణ, బొల్లా వీర్రాజు కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. ప్రమాదంలో నలుగురు యువకులు మృతిచెందడం ఎంతో బాధకలిగించిందన్నారు. కొద్దిరోజుల్లో కుటుంబాలకు తగిన సహాయసహకారాలు అందించి, అండగా ఉంటామన్నారు. అనంతరం ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. తాడిపర్రు విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మారిశెట్టి మణికంఠ, బొల్లా వీర్రాజు, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం చెక్కులు కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు వీరమల్లు బాలాజీ, సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు,తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రామారావు పాల్గొన్నారు.



మేమున్నాం : తాడిపర్రులో మృతుల కుటుంబీకులను ఓదారుస్తున్న మంత్రి దుర్గేష్

## ఉత్తుత్తి కూలీలతో విచారణేది!

### తూతూమంత్రంగా ముక్కినాడలో విచారణ

రాజానగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముక్కినాడ గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో వెలుగుచూసిన అవినీతి, అక్రమాలపై మంగళవారం విచారణ జరిపారు. 'మస్తర్ల మాయాజాలం' శీర్షికన ఈ నెల 3న ఆంధ్రజ్యోతిలోవెలువడిన కథనంపై డ్వామా పీడీ నాగమహేశ్వరరావు స్పందించి విచారణకు ఆదేశించారు.ఈ మేరకు ఏపీడీ రాంప్రసాద్, రాజానగరం ఇన్‌చార్జ్ ఏపీవో బాలరాజుతో కలిసి మంగళవారం విచారణ చేపట్టారు.ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన జాబ్‌కార్డుదారుల పేర్లతో పాటుగా పనిలోకి రాకుండా వేతనాలు డ్రా చేస్తున్న మరి కొంత మంది పేర్లను గ్రామస్తులు అధికారులకు సమర్పించారు. దొంగ మస్తర్ల నమోదుపై ఆన్‌లైన్‌లో క్షుణ్ణంగా పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరు గురించి కూలీలను ఆరా తీశారు. అయితే గ్రామస్తులు మాత్రం అధికారుల విచారణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనిలోకి రాకుండా వస్తున్నట్టుగా మస్తర్లు నమోదు చేసి వేతనాలు డ్రాచేస్తున్న ఉత్తుత్తి కూలీలను వదిలి పెట్టి..పనిలోకి వస్తున్న కూలీలను విచారించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.ఈ విషయమై విచారణాధికారిగా విచ్చేసిన రాంప్రసాద్‌ను సంప్రదించగా తొలిరోజు కొంత మందిని మాత్రమే విచారించామని,మరో పర్యాయం విచారిస్తామని బదులిచ్చారు.

### ప్రిన్సిపాల్‌కు బెదిరింపు పోస్టులు

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో దుర్భాషలాడుతూ.. .. చంపేస్తానని బెదిరింపు పోస్టులు పెడుతున్న జూనియర్ కళాశాల రికార్డు అసిస్టెంట్‌పై కేసు నమోదు చేశారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.వి.వి సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు.గత పది రోజులుగా విధులకు గైర్హాజరై- మద్యం సేవించి అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో చంపేస్తానని పోస్టులు పెడుతున్నాడు. దీనిపై ప్రిన్సిపాల్ జి. సతీష్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుపై ఇరు వర్గాల మధ్య 18 నెలలుగా వివాదం నెలకొంది. సోమవారం విగ్రహావిష్కరణ ఏర్పాట్లలో భాగంగా ఒక వర్గానికి చెందిన యువకులు 'గ్రామంలో ఎవడ్రా మమ్మల్ని ఆపేది' అంటూ 15 అడుగుల ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనికి ప్రతిగా మరో వర్గం యువకులు 'మేమేరా మిమ్మల్ని ఆపేది' అంటూ 20 అడుగుల ఫ్లెక్సీని తయారు చేయించారు. దీని ఏర్పాటులో కరెంట్ షాక్‌తో నలుగురు యువకులు మృతి చెందారు. ప్రశాంతంగా ఉండే గ్రామ సీమల్లోనూ ఇలాంటి స్లోగన్స్‌తో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు కక్షలను పెంచుతూ.. ప్రాణాలు తీస్తున్నాయి.



యమపాశం : తాడిపర్రులో ఈ ఫ్లెక్సీ పైన ఉన్న విద్యుత్ తీగ కారణంగా నలుగురు మృత్యువాతపడ్డారు..

ఎన్నికల్లో భాగంగా నిడదవోలు పట్టణంలో ఒక పొలిటికల్ మీటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.. కొంత మంది యువకులు కలిసి ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని తలంచారు.. అనుకున్నదే తడవుగా ఫ్లెక్సీ కట్టేందుకు ఉపక్ర మించారు.. పైన విద్యుత్ తీగలు ఉన్న సంగతి గమనించక పోవడంతో ఫ్లెక్సీ కడుతుండగానే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ఒక యువకుడు మృతిచెందాడు.

# ఫ్లెక్సీకు.. ఫ్లెక్సీలు!





కలెక్టర్ ఆదేశాలతో తాడిపర్రు గ్రామంలో తొలగించిన ఫ్లెక్సీలు ఆటోలో తరలింపు

రాజమహేంద్రవరం/పెరవలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రచారం పిచ్చి పీక్‌కి చేరింది.. ప్రస్తుతం ఫ్లెక్సీల ఏర్పాటు ట్రెండ్‌గా మారింది.. సందర్భమేదైనా ఫెక్సీలు పెట్టడం ఆనవాయితీగా మారిపోయింది.గ్రామాల్లో రాజకీయనేతలు, యువత కూడా ప్రచారం కోసం ఫ్లెక్సీలు కట్టడం ఫ్యాషన్‌గా మారిపోయింది.ఎక్కడికక్కడ వ్యక్తిగతంగా కూడా ఫెక్సీలు పెట్టేసుకుంటున్నారు. కేవలం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడో, ప్రజా ప్రతినిధులకో,అధికారులకో కోపం వచ్చినప్పుడో ఫెక్సీలను తొలగించడం,తర్వాత మౌనం వహించడం అలవాటైపోయింది. ఇటీవల సుప్రీం కోర్టు కూడా పబ్లిక్ స్థలాల్లో ఫ్లెక్సీలపై సీరియస్ అయిన సంగతి తెలిసిందే.అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో ఫెక్సీ కడుతూ నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో ప్రస్తుతం ఫెక్సీల మీద చర్చ మొదలైంది. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌లో ఫెక్సీలు పెట్టడానికి సిటీ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి ఉండాలి. అయినా అధికారులు పట్టించుకోరు.ఈ నేపథ్యంలో ఎవరికి వారు ఇష్టానుసారంగా ఫెక్సీలు పెడుతున్నారు.ఒక్కొక్కసారి ఈ ఫ్లెక్సీలు వివాదాలకు కారణమవుతున్నాయి..రెండు వర్గాల మధ్య గొడవలకు దారితీస్తున్నాయి.. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు మీదకు తెస్తున్నాయి..ఇటీవల పెళ్లయినా.. పేరంటమైనా.. రాజకీయ నాయకులు వస్తున్నా.. అభిమాన హీరో సినిమా రిలీజ్ అయినా.. పుట్టిన రోజైనా.. చావైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సంప్రదాయంగా మారిపోయింది.ఆ ఫ్లెక్సీల ఏర్పాటుపై పరిమితి లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టానుసారం ఫ్లెక్సీలు పెడుతున్నారు. చిన్న సైజు ఫ్లెక్సీలు కాకుండా పెంచుకుంటూ పోతుండడంతో ఒక్కోసారి ప్రమా దాలకు కారణమవుతున్నాయి. చాలా చోట్ల వివాదాలు జరుగుతున్నాయి. ఈ ఫ్లెక్సీలు ఏర్పాటులో రాజకీయ పరంగా, కులాల పరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఎంత ఖర్చయినప్పటికీ ఎదుటి వారు పెట్టిన ఫ్లెక్సీ కంటే పెద్దగా ఉండాలన్న ఉద్దేశంతో ఐరెన్ రాడ్‌లు ఏర్పాటు చేసి మరీ ఎత్తులో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అది 10 అడుగులు.. 20 అడుగులు..30 అడుగులు ఇలా పెంచుకుంటూ పోతున్నారు.ఇష్టానుసారం పెడుతున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఫ్లెక్సీల ఏర్పాటుపై అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. మిగిలిన రోజుల్లో ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో ఇష్టానురీతిన ఎక్కడబడితే అక్కడ ఎవరికి నచ్చిన చోటులో వారు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. మెయిన్ రోడ్లు కూడలి ప్రదేశాల్లో వీటిని అధిక సంఖ్యలో ఏర్పాటు చేయడంతో ఇబ్బందిగా మారుతున్నాయి. ఈ ఫ్లెక్సీల కారణంగా పలు సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో అనేక సందర్భాల్లో విద్యుదాఘాతానికి గురై అనేక మంది మృత్యువాతపడిన సందర్భాలు ఉన్నాయి. సోమవారం తాడిపర్రులో కూడా ఇదే విధంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తూ నలుగురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. గతంలో నిడదవోలు పట్టణంలోనూ ఫ్లెక్సీ కడుతూ ఒక యువకుడు మృత్యువాతపడ్డాడు. దివాన్‌చెరువులో ఓ స్కూల్ ఫ్లెక్సీ కడుతూ ఒకరు మృతి చెందారు. కొంత కాలం కిందట ఏవీ అప్పారావురోడ్డులో ఓ విద్యా సంస్థ ఫ్లెక్సీ కడుతూ ఒకరు మృతి చెందారు. అప్రమత్తంగా లేకపోవడం వల్ల ఇలా చాలా చోట్ల జరుగుతున్నాయి. గతే దాది కొవ్వూరు మండలం దొమ్మేరులో అప్పటి హోంమంత్రి వనిత ఫ్లెక్సీని చిం చాడనే కారణంతో ఓ వైసీపీ కార్యకర్తను పోలీసులు వేధించడంతో అతను ఆత్మ హత్య చేసుకున్నాడు.ఫ్లెక్సీల కారణంగా గ్రూపులు తయారవుతున్నాయి. కొవ్వూరు, రాజమహేంద్రవరం,అనపర్తి, రాజానగరం,గోపాల పురం నియోజకవర్గాల్లోనూ ఫ్లెక్సీ వివాదాలు తారాస్థాయికి చేరిన ఘటనలు ఉన్నాయి. తాడిపర్రులో కలెక్టర్ ప్రశాంతి పర్యటించి ఘటనకు ఫ్లెక్సీ వివాదమే కారణమని గమనించారు. గ్రామంలో ఫ్లెక్సీలన్నీ తొలగించాలని ఆదేశించారు.ఏ విధమైన ఫ్లెక్సీలు లేకుండా పంచాయతీ ,రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ముం దుగానే అధికార యంత్రాంగం ఆ పనిచేసి ఉంటే ఈ రోజు మా కుమారులు మా కళ్లెదుటే ఉండేవారని ఫ్లెక్సీల ఏర్పాటుపై నిబంధనలు విధిం చాలని డిమాండ్ చేశారు.

### ఫ్లెక్సీని 10 అడుగుల లోపే పెట్టాలి..

ఫ్లెక్సీలు నేల నుంచి 6 నుంచి 10 అడుగులలోపే పెట్టుకోవాలి. ఎత్తు పెరిగితే ప్రమాదాలు జరుగుతాయని తూర్పు గోదావరి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ బాలగంగాధర్ తిలక్ చెప్పారు. విద్యుత్ లైన్ మూడడుగుల ఎత్తులో ఏది ఉన్నా కరెంట్ షాక్ కొడుతుందని చెప్పారు.

### భారీ కటౌట్‌లు.. విద్వేషపూరిత రాతలు

- తాడిపర్రు ఘటనకూ ఇదే కారణం
- పెరుగుతున్న ప్రమాదాలు.. వివాదాలు
- గాలిలో కలిసిపోతున్న ప్రజల ప్రాణాలు
- పచ్చని పల్లెలకూ పాకిన విద్వేషాలు
- అనవసర గొడవలకు ఫ్లెక్సీల ఆజ్యం
- చర్యలు తీసుకోకుంటే ముప్పు



### ప్రభుత్వం చర్యలు చేపట్టాలి..

ఫ్లెక్సీల ఏర్పాటుపై నిబంధనలు కఠినతరం చేయాలి. ఫ్లెక్సీ ఏర్పాటుచేసే ముందు సంబంధిత అధికారికి చూపించిన తర్వాతే ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి. ఫ్లెక్సీలపై ఎదుటి వర్గం, కులం వారిని, హీరోల అభిమానులను రెచ్చగొట్టేలా అవమానించే విధంగా రాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. అవతలి వర్గం వారి ఫ్లెక్సీలను చించి వేస్తూ గొడవలకు కారణమవుతున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే భవిష్యత్తులో ఫ్లెక్సీల వివాదాలు అమాయక ప్రజలపై పడి వారు ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అవసరమైతే ఇసుక తీసుకెళ్లొచ్చు

### ఓపెన్ ర్యాంపుల నుంచి ట్రాక్టర్లతో ఉచిత ఇసుక

- ఇసుక సరఫరాపై నిఘా
- ఉచిత నిల్వ చేయవద్దు
- నిబంధనలు మీరితే చర్యలే
- కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

రాజమహేంద్రవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సొంత అవసరాలకు ఇసుకను ఓపెన్ ర్యాంపుల నుంచి ట్రాక్టర్ల ద్వారా తవ్వుకుని తీసుకెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా తమ సొంత అవసరాలకు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకెళితే ఎవరూ అభ్యంతరం చెప్పరన్నారు.ఇసుకను నిల్వ చేసుకుని వేరేవాళ్లకు విక్రయిస్తే మాత్రం నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం 9 డీసిల్టేషన్ పాయింట్ల నుంచి ఇసుక తీస్తుండగా, 16 ఓపెన్ రీచ్‌లకు అనుమతి ఇచ్చామని అందులో ఐదు ఇప్పటికే ఓపెన్ అయ్యాయన్నారు. ర్యాంపులలో నీరు ఉండడం వల్ల కొంత సమస్య వచ్చిందని, ఈవారంలోపు మొత్తం ఓపెన్ కావాలన్నారు.ఇసుక కొరత లేదని, జిల్లాలో అవసరానికి మించి ఇసుక వస్తుందన్నారు. కోటిలింగాలరేవు, ఇతర ప్రాంతాల్లో రాత్రుల వేళ ఇసుక డ్రెడ్జింగ్ జరుగుతుందని కొందరు చెప్పారు. దీనిపై స్పందించిన ఆమె ఎస్పీతో కలసి అధికారులు దృష్టిపెడుతున్నారని, ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి ఎవరు డ్రెడ్జింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మిగతా ర్యాంపుల్లో కూడా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామని, గాయత్రి ర్యాంపులో మూడు ఇసుక లారీలను సీజ్ చేసినట్టు ఆమె తెలిపారు.

### గాయిత్రి ర్యాంప్‌లో 3 టిప్పర్లు సీజ్

ధవళేశ్వరం,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ధవళేశ్వరంలోని గాయిత్రి ఇసుక ర్యాంప్‌ను మంగళ వారం ఉదయం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇసుక లోడ్‌చేసిన 3 టిప్పర్‌లను గమనించి వాటిని తనిఖీ చేసి డ్రైవర్లను ప్రశ్నించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేకుండానే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. సదరు లారీ యాజమాన్యంపై విచారణచేసి ఇసుక టిప్పర్లను సీజ్ చేయాలని దక్షిణ మండలి డీఎస్పీ భవ్య కిషోర్‌కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలనలో నిర్దేశించినమార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కృష్ణనాయక్ అన్నారు.

### కాటవరంలో లారీ పట్టివేత

సీతానగరం,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కాటవరం గ్రామం వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని సీజ్ చేశామని ఎస్ఐ డి.రామ్ కుమార్ మంగళవారం తెలిపారు. సీతానగరం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న లారీ పట్టుకుని స్టేషన్‌కు తరలించి ఏడీ మైన్స్‌కు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉచిత ఇసుక పేరుతో వందలాది ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తూ కొంతమంది ఇసుకను అక్రమంగా నిల్వచేసి లారీలలో లోడ్ చేస్తున్నట్టు తెలుస్తోంది ఈ నేపథ్యంలో అక్రమ ఇసుక లారీని పోలీసులు పట్టుకున్నారు.





గాయత్రి ర్యాంపులో తనిఖీ చేస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్



కాటవరంలో సీజ్ చేసిన టిప్పర్

## అమల్లోకి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

రాజమహేంద్రవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో సోమవారం నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేక రులతో మాట్లాడారు.ఎన్నికల ప్రక్రియ ముగిసే డిసెంబర్ 12వ తేదీ వరకూ ఈకోడ్ అమలులో ఉంటుందన్నారు.ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవరిస్తారని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా తూర్పుగో దావరి జిల్లా రెవెన్యూ అధికారి (డీర్వో) టి. శ్రీరామ చంద్రమూర్తి వ్యవహరిస్తారని చెప్పారు. జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలానికి ఒకటి వంతున జిల్లాలోని 18 మండలాల్లో 10 కేంద్రాలు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

### 11 నుంచి నామినేషన్ల స్వీకరణ : కలెక్టర్

రు.జిల్లాలో మొత్తం 2893 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారన్నారు.ఉప ఎన్నిక కోసం ఈ నెల 11న నోటిఫికేషన్ జారీ అవుతుందని తెలిపారు.అదే రోజు నుంచి 18వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారన్నారు.19న నామినేషన్ల స్క్రూట్నీ చేసి 21 అభ్య ర్థుల విత్‌డ్రాకు చివరి తేదీ అన్నారు.డిసెంబర్ 5న పోలింగ్,9న ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారన్నారు.. 12వ తేదీకి ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు.

## ఉల్లి ధర లొల్లి

### కర్నూలు ఉల్లి వచ్చిన తగ్గని ధర



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఉల్లిపాయల ధరలు మండుతూనే ఉన్నాయి. నెలల తరబడి రేటు దిగిరావడంలేదు. కర్నూలు ఉల్లి మార్కెట్‌ను ముంచెత్తినా మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ తగ్గడంలేదు. మరోపక్క షోలాపూర్ రకం కొత్త ఉల్లిపాయలు మార్కెట్‌ను ప్రభావితం చేయలేకపోతున్నాయి. రైతు బజార్లలో మహారాష్ట్ర ఉల్లి , కర్నూలు ఉల్లికి మధ్య రేటు తేడా చూస్తే మహారాష్ట్ర ఎంత డామినేట్ చేస్తుందో అర్థమవుతుంది. రైతు బజార్లలో కర్నూలు రకం కేజీ రూ.26 ఉంటే, మహారాష్ట్ర కేజీ రూ.50 ధర ఉంది. బహిరంగ మార్కెట్లో నాణ్యత కల్గిన మహారాష్ట్ర ఉల్లిపాయలు కేజీ రూ.60 నుంచి రూ.70 వరకూ విక్రయిస్తుండగా, కర్నూలు పాయలు మాత్రం రూ.25లు దాటకపోవడం గమనార్హం. షోలాపూర్ కొత్తపాయలు కేజీ రూ.30లోపే ఉన్నాయి. ఉభయగోదావరి, విశాఖపట్నం అర్బన్, కృష్ణా తదితర కొన్ని ప్రాంతాల ప్రజలు మహారాష్ట్ర రకం ఉల్లిపాయలను తప్ప ఇతర రకాలను వినియోగించరని, ఎంత రేటు ఉన్నా వాటినే కొంటారని,దీంతో మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు విశ్లేషిస్తున్నారు.

### గూడెం మార్కెట్‌కే కర్నూలు ఉల్లి

కర్నూలు రకం ఉల్లిపాయలకు తాడేపల్లిగూడెం హోల్‌సేల్ మార్కెట్ ప్రాచుర్యం పొందింది. ఇక్కడి నుంచే వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు కర్నూలు ఉల్లిని ఎగుమతి చేస్తారు. కర్నూలు ఏరియాలో ఎక్కువగా కాంట్రాక్టు ఫార్మింగ్ ఉంటుంది. దీంతో తాడేపల్లిగూడెంలోని కొంతమంది బడా హోల్‌సేల్ వ్యాపారులు కర్నూలు ప్రాంత రైతులకు ముందుగా అడ్వాన్సులు ఇచ్చి పంట చేతికొచ్చినప్పుడు సరుకును తీసుకొస్తుంటారు. సాగుకు ముందే రైతులకు పెట్టుబడి పెట్టడంతో సరుకు డైరెక్టుగా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వస్తోంది. వీటిని ఇక్కడి హోల్‌సేల్ ట్రేడర్లు జార్ఖండ్, ఒడిశా, బీహార్ వంటి ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం ప్రాంతాల్లోని సామాన్య, దిగువ మధ్యతరగతి వర్గాలు ఈ రకం పాయలను ఎక్కువగా వినియోగిస్తారని, మహారాష్ట్రతో పోల్చితే ధర కాస్త తక్కువ కావడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కర్నూలు పాయలకు దిగువతరగతి వర్గాలే టార్గెట్. కర్నూలు ఉల్లి తొందరగా డ్యామేజీ అవుతుంది. నిలవకు ఆగదు. మహారాష్ట్ర ఉల్లిపాయలు నెలల తరబడి గొడౌన్లలో నిల్వచేసినా పాడవకుండా ఉంటాయి. కర్నూలు ఉల్లికి ఆ పరిస్థితి లేదు. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్టే ఆ రోజున్న రేటుకు హోల్‌సేల్ ట్రేడర్లు అమ్మేస్తుంటారు. అందువల్లే మహారాష్ట్ర పాయలను కొన్నంత ధైర్యంగా కర్నూలు పాయలనుట్రేడర్లు కొనుగోలు చేయరు.

### నాసిక్ ఉల్లికి కొన్నాళ్లు ఆగాల్సిందే..

దీపావళి పండుగ తర్వాత మహారాష్ట్ర కొత్త ఉల్లిపాయలు మార్కెట్లోకి వస్తాయని అంతా భావించారు. హోల్‌సేల్ ట్రేడర్లు ఇదే చెబుతూ వచ్చారు. ఆ మేరకు ఒక్క షోలాపూర్ ప్రాంతం నుంచి మాత్రమే కొత్త ఉల్లిపాయలు మార్కెట్లకు వస్తున్నాయి. మార్కెట్లో మంచి డిమాండ్ కల్గి, ఎక్కువ రోజులు నిల్వ ఉండే సరుకుగా పేరున్న నాసిక్ ఉల్లి ఎప్పుడు వస్తుందనేది హోల్‌సేల్ ట్రేడర్లు సైతం చెప్పలేకపోతున్నారు. ఇక కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్‌ను ముంచెత్తినా ధరలను ప్రభావితం చేసే పరిస్థితి లేకపోవడంతో ప్రజలకు ధరాభారం తప్పడంలేదు. అనంతపురం పంట వస్తుందని చెబుతున్నా కచ్చితమైన సమాచారం లేదు. షోలాపూర్ రకం మాదిరిగా అనంతపురం ఉల్లిపాయలు మీడియంగా ఉంటాయని, అవి మార్కెట్లకు వస్తే ధరలు కాస్త అదుపులోకి రావొచ్చని భావిస్తున్నారు. గతంలో కర్నాటకలోని కోలార్ జిల్లాలో ఉల్లిసాగు చేసేవారు. అక్కడి రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపడంతో రావడంలేదు.

# పంటలో కేళీలను ఏరివేయాలి

**» రైతులకు శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు**



శెట్టిపేటలో రైతులతో మాట్లాడుతున్న మాధవరావు

నిడదవోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరిపంట కోత దశకు వచ్చిన సమయంలో పంటలోని కేళీలను (బెరుకులు) ఏరివేయాలని దీని వల్ల ధాన్యం నాణ్యత పెరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు పంటకోతలు, అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాధవరావు మాట్లాడుతూ కోత కోసిన ధాన్యాన్ని తేమ శాతం 17% వచ్చే వరకు ఆరబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని 75 కిలోల బస్తాకు రూ.1725 మద్దతు ధర పొందవచ్చని చెప్పారు. రైతాంగం తమ ధాన్యాన్ని తమకు నచ్చిన మిల్లుకు పంపించుకోవచ్చని, ధాన్యం విక్రయించిన 48 గంటల్లో వారి ఖాతాకు నగదు జమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏవో జి.సత్యనారాయణ, ఏఈవో కృష్ణ, భాను శేఖర్, రైతులు గంటా విజయ్, గంటా సోమన్న, పాటంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకే బంగారమంటూ మోసం

**» షిర్డీ మ్యూజియంలో పనిచేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు.. కేసు నమోదు**

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇస్తానని చెప్పి డబ్బు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం పాత పట్టిసీమకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నారపురెడ్డి కనకయ్య మధురపూడి ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. 2023 జూలై 6న కుటుంబ సభ్యులతో షిర్డీ వెళ్లాడు. అక్కడి మ్యూజియంలో పనిచేస్తున్న అల్లాడి కునాల్ కశ్యప్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి కనకయ్య భార్య వరలక్ష్మిని కశ్యప్ అక్కా అని పిలిచేవాడు. 2024 ఫిబ్రవరి 6న పట్టిసీమ ఇంటికి వచ్చి వధువు ఫొటోలు చూపించి పెళ్లి కుదిరిందని చెప్పి 2 వారాలు ఇంట్లో ఉన్నాడు. విదేశాల్లో కొంత బంగారం తక్కువ ధరకు లభించిందని, దానికి సంబంధించి సెక్యూరిటీ డిపాజిట్లు చెల్లించాలని, బంగారానికి రూ.4,80,000 దఫదఫాలుగా ఫోన్‌పే ద్వారా ఎస్‌బీఐ అకౌంట్‌కి, బైక్‌కి సంబంధించి కొవ్వూరు బజాజ్ షోరూంలో రూ.86,000 చెల్లించారు. ఎంతకీ బంగారం గాని, బైక్ గాని, ఇవ్వకపోవడంతో తీసుకున్న డబ్బు ఇవ్వాలని ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం చెప్పడం లేదన్నారు. విశాఖపట్నం ఆది ఆసుపత్రిలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లి కనకయ్య విశాఖపట్నం ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును కొవ్వూరు రిఫర్ చేశారు. దీనిపై కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు మరలా కేసునమోదు చేసినట్టు తెలిపారు.

# ‘ఫసల్ బీమా’ను వినియోగించుకోవాలి

**» జిల్లా ఉద్యానవన శాఖాధికారిణి సుజాతకుమారి**



అన్నదేవరపేటలో మాట్లాడుతున్న ఇన్సూరెన్స్ ప్రతినిధులు

తాళ్లపూడి,నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ప్రతి రైతూ వినియోగించుకోవాలని, ముఖ్యంగా జీడిమామిడి రైతులంతా ఉపయోగించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారిణి బి.సుజాతకుమారి తెలిపారు. మండలంలోని అన్నదేవరపేట, పోచవరం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ బీమా ద్వారా రైతు ధైర్యంగా వ్యవసాయం చేయవచ్చన్నారు. రబీలో ప్రభుత్వం జీడిమామిడి రైతులకు అండగా నిలుస్తూ అమలు చేస్తోన్న ఫసల్ బీమా పథకంలో చేరేందుకు ఈ నెల 15వ తేదీ వరకే అవకాశం ఉందన్నారు. జిల్లాకు ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని కేటాయించారని ఒక ఎకరానికి రూ.1500 చెల్లించాలని, ఈకేవైసీ, ఈ-పంట నమోదు పూర్తి చేసుకున్న రైతులు మాత్రమే అర్హులని జిల్లాలో 7619 మంది జీడిమామిడి పండించే రైతులు ఉన్నారని మండలాల వారీగా రైతులందరికీ అవగాహన కలిగించే విధంగా పర్యటిస్తున్నట్టు సుజాతకుమారి చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాస్, తాళ్లపూడి ఏవో రుచిత, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ వారోత్సవాల సమీక్ష

నల్లజర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాను నిర్వహించేందుకు అభివృద్ధి కమిటీ చైర్మన్ గుదే సుశీల అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణ, విద్యార్థులతో వివిధ రంగాల్లో పోటీలు నిర్వహించాలని కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీరామ్మూర్తి, తాడి రమేష్ పాల్గొన్నారు.

# కుమారదేవం నుంచి ఉచిత ఇసుక

**» ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై తోలకం ప్రారంభం**
**» ఇంటి నిర్మాణం, అభివృద్ధి పనులకే తీసుకెళ్లాలి**
**» నిల్వ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవు: తహశీల్దార్**


కుమారదేవం ర్యాంపు నుంచి ఉచిత ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్లు

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం కుమారదేవం ఓపెన్ రీచ్ నుంచి ట్రాక్టర్లపై ఉచిత ఇసుక తోలకం ప్రారంభమయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టర్లపై ఉచిత ఇసుకను తీసుకువెళ్లవచ్చని ప్రకటించినా ఇప్పటివరకు అది పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇటీవల కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ట్రాక్టర్లపై ఇంటి నిర్మాణానికి ఇసుక తీసుకెళ్లే వారిని ఇబ్బందులు పెట్టవద్దని ఆదేశించారు. అనంతరం ఈ నెల 2న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ(డీఎల్ఎస్‌సీ) సమావేశంలో ఓపెన్ ర్యాంపుల్లో ఇసుకను సొంతంగా మనుషులను పెట్టి తీసుకోవచ్చని, లేదా డీఎల్ఎస్‌సీ ఎంపిక చేసిన ఏజెన్సీ సహాయం తీసుకోవచ్చునన్నారు. ట్రాక్టర్ల ద్వారా నేరుగా ఓపెన్ రీచ్‌ల నుంచి ఇసుక తీసుకుని వెళ్లవచ్చునని తెలపడంతో మంగళవారం సాయంత్రం నుంచి కొవ్వూరు మండలం కుమారదేవం రీచ్ నుంచి ట్రాక్టర్లపై ఉచిత ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణదారులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై రీచ్‌లకు వెళ్లి సొంతంగా మనుషులను పెట్టి లోడింగ్ చేసుకుని ఇసుక సొంత అవసరాల మేరకు మాత్రమే తీసుకెళ్లవచ్చునన్నారు. ట్రాక్టర్ల యజమానులు, నిర్మాణదారులు ఇసుక తవ్వకాలు, లోడింగ్‌కు సంబంధించి ఎటువంటి యంత్రాలు వినియోగించరాదన్నారు. ఉచిత ఇసుక కోసం నిర్మాణదారులు తమ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి నుంచి అనుమతి పొందాలన్నారు. ఇంటి నిర్మాణం, అభివృద్ధి పనులకు కాకుండా ట్రాక్టర్లపై ఉచిత ఇసు క తీసుకువెళ్లి ఎక్కడైనా డంపింగ్ చేసి వ్యాపార నిమిత్తం నిల్వచేసినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ అన్నారు.

## రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు జూనియర్ అసిస్టెంట్ అదృశ్యం

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. బాపట్ల జిల్లా నాగారం గ్రామానికి చెందిన మన్నెం విజయ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుగా పనిచేస్తోంది. విజయ కొవ్వూరులోని మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద షేక్ బాషా ఇంటిలో అద్దెకు ఉంటోంది. అక్టోబరు 14వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని జైలు అధికారులు నవంబరు 1వ తేదీన ఇంటికి సమాచారం అందించారు. దీంతో విజయ సోదరి పాగోలు ఉదయభాస్కరమ్మ కొవ్వూరు వచ్చి ఇంటి యజమానిని చెల్లెలు గురించి ఆరా తీశారు. అక్టోబరు 11న ఊరు వెళ్తున్నాని చెప్పి ఇంటికి తాళం పెట్టి వెళ్లిందని, తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో ఉదయ భాస్కరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

## లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు
# పరిష్కారమవ్వాలి

**9వ అదనపు జిల్లా జడ్జి అనూరాధ**


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ మార్గంలో పరిష్కారమయ్యే విధంగా న్యాయవాదులు సహకరించాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనూరాధ అన్నారు. మంగళవారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీమార్గంలో పరిష్కారమవ్వాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, వాహన ప్రమాదాల కేసులు, బీఎస్ఎన్ఎల్ బకాయి, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీచేసుకోవచ్చునన్నారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపరచుకుని, సమయాన్ని, డబ్బు ఆదా చేసుకోవాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.నాగలక్ష్మి, బార్ అధ్యక్షుడు వై.చలపతి, టి.చిట్టిబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఆశాజనకంగా వరి దిగుబడులు

**గ్రోమోర్ సురక్ష ప్రయోగాత్మక ప్లాట్‌లో ఎకరానికి 45 బస్తాలు**


పంట కోత ప్రయోగం చేస్తున్న కోరమండల్ సభ్యులు

నల్లజర్ల,నవంబరు 05 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది సార్వా వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు నిమ్మలపూడి ప్రసాద్, బొమ్మిరెడ్డి వేణుగోపాల్ కండెపు వెంకటరత్నం, బలుసు ధర్మారావులు వివరించారు. అభ్యుదయ రైతు నిమ్మలపూడి ప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలో సాధారణ ఎరువులతో ఒక ఎకరం గ్రోమోర్ ఎరువులతో గ్రోమోర్ సురక్ష పథకంలో ఎకరంలో వరి 7029 స్వర్ణ రకాన్ని ప్రసాద్ సాగు చేశారు. సాధారణ ప్లాట్‌లో వేసిన ఎకరంలో 40 బస్తాలు దిగుబడి రాగా గ్రోమోర్ ఎరువులతో సాగు చేసిన ప్లాట్‌లో 45 బస్తాలు దిగుబడి వచ్చినట్లు పంట కోత ప్రయోగంలో తెలిందని ప్రసాద్ వివరించారు.ఈ పంట కోత ప్రయోగంలో పరసర రైతులతో పాటు గ్రోమోర్ ఏరియ మేనేజర్ కృష్ణ రాజు,సినియర్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నేడే ఆఖరు

**ఎమ్మెల్యే ముప్పిడి**


తాళ్లపూడిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి/కొవ్వూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు బుధవవారంతో ముగుస్తుందని, ఓటు నమోదు శాతం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు, సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చెప్పారు. నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ మండలంలోని అన్ని సచివాలయాలను, ప్రభుత్వ కార్యాలయాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి తహశీల్దార్ కార్యాయలయంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. అలాగే కొవ్వూరు మండలం ధర్మవరం, కాపవరం గ్రామాలతో పాటు కొవ్వూరులోని ఏబీఎన్ కళాశాలలో విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. అభ్యర్థులు ఫారం-18, డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఫోన్ నెంబరు అందజేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులున్నారు.



దేవరపల్లి సమావేశంలో పాల్గొన్న తహశీల్దార్, ఎంపీడీవో

**దేవరపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. పట్టభద్రులను గ్రామ సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు గుర్తించి ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. 2021 అక్టోబర్ 31వ తేదీకి డిగ్రీ పూర్తి చేసిన వారికి ఓటుహక్కు ఉంటుందన్నారు. ఓటు నమోదు చేసుకునేవారు తమ దరఖాస్తులను తహశీల్దార్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.


అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన శేషారావు

## సీఎంను కలిసిన శేషారావు

నిడదవోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని మంగళవారం అమరావతిలో నిడదవోలు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, పార్టీ సభ్యత్వ నమోదుపై సీఎం చంద్రబాబుకు తెలిపినట్టు ఆంధ్రజ్యోతికి ఆయన తెలిపారు.

## విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపుపై నిరసన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 5 ( ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులో సర్దుబాటు చార్జీల పెంపును నిరశిస్తూ రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో ధర్నా చేశారు. డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ బిల్లులు సర్దుబాటు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, డాక్టర్ వడయార్, ఎం.శారద , చింతాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## అన్న సమారాధన

దేవరపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కార్తీకమాసం మంగళవారాన్ని పురస్కరించుకుని అన్నసమారాధన చేశారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, లక్ష తమలపాకులతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన


అనపర్తిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తజనం


నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పుట్టవద్ద పాలు పోస్తున్న భక్తులు

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి

**• కిటకిటలాడిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు • ప్రత్యేక పూజలు, అభిషేకాలు • పుట్ట వద్ద పాలుపోసిన మహిళలు • బాణసంచా కాల్పులు**


కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంతో పాటు మండలంలో నాగుల చవితిని భక్తి శ్రద్ధలతో జరిపారు. మంగళవారం వేకువజాము నుంచే కొవ్వూరు పరిసర ప్రాంతాల భక్తులు గోష్పాద క్షేత్రంలో అఖండ గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి, సంస్కృత పాఠశాల శివాలయాల్లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి, గోదావరిగట్టుపైనున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో పంచామృత అభిషేకాలు చేశారు. కొవ్వూరులోని ఆర్డీవో కార్యాలయం, గోదావరి బండ్, ఏజీఆర్‌బి కార్యాలయం, శ్రీనివాస స్నాన ఘట్టంలో రావణబ్రహ్మ శివాలయం వద్ద, గౌతమీనగర్, వేములూరు రోడ్డుతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు వేకువజాము నుంచే పుట్టలో పాలుపోసి నాగులచవితిని భక్తి శ్రద్ధలతో జరిపారు.

**నిడదవోలు:** మండలంలోని సమిశ్రగూడెంలో మంగళవారం నాగుల చవితిని పురస్కరించుకుని నాగదేవత ఆల యంలో పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పుట్ట వద్ద పూజలు చేసి మొక్కుబడులు చెల్లించారు.

**ఉండ్రాజవరం:** మండలంలో నాగుల చవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉండ్రాజవరం వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వెనుక ఉన్న పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కె.సావరం, మోర్త, చిలకపాడు, వేలివెన్ను తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.


ఉండ్రాజవరంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

# నైపుణ్య గణన బాధ్యతగా చేపట్టాలి


దేవరపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

చాగల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే నైపుణ్యగణనను బాధ్యతతో చేయాలని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన నైపుణ్యగణన శిక్షణ జరిగింది. ఆమె మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి యువతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాన్ టెక్నికల్ ఆఫీసర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** నిరుద్యోగ యువతీ, యువకులను గుర్తించి వారికి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందని గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెం ట్లకు ఎంపీపీ కేవీకే దుర్గారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం జరిపారు. ఎంపీపీ దుర్గారావు మాట్లా డుతూ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌ను ప్రవేశపెట్టిందని నిరుద్యోగులు నచ్చిన రంగాల్లో చేరేందుకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ కే.రాజ్యలక్ష్మి, కార్యదర్శులు ఎన్.రవికిషోర్, టీఎస్ రామచంద్రరావు, ఈఓపీఆర్‌డీ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ భరత్‌రామ్‌పై ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 5( ఆంధ్రజ్యోతి): సత్యదూరమైన ప్రచారాలు చేస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయ కులు డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన భరత్‌రామ్‌పై చర్యలకు టీడీపీ నాయకులు యిన్నమూరి దీపు, నల్లం శ్రీను, బుడ్డిగ రవి, చాపల చిన్నరాజు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ అప్పారావుకు మంగళవారం ఫిర్యాదు అందించారు. కూటమి ప్రభు త్వంపై సత్యదూరమైన ప్రచారాలు చేస్తే ఊరుకోమన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

దేవరపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ట్రాన్స్‌కో నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు.

## వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం

దేవరపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆశ్రమానికి మంగళవారం గోపాలపురం మండలం కోమటిగుంట వైసీపీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెలగా శ్రీరామమూర్తి కుమారుడు హరితేజ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం, దుస్తులు, స్వీట్లు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు గుదే శ్యామలా దేవికి రూ.20వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సాలి వేణు, కదలి హైమావతి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణంపాలెం వయోవృద్ధుల ఆశ్రమానికి నగదు అందజేస్తున్న దాత

# ప్రభుత్వ ఉద్యోగులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


నైపుణ్యంపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ విద్యాపతి

గోపాలపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధిపై మంగళవారం ఒక్కరోజు శిక్షణను జరిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు నైపుణ్యయాప్‌పై ఇచ్చే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ ఇచ్చేందుకు మండలంలోని సచివాలయ డీఈవో దీపక్ విజయ్ జిల్లాస్థాయిలో శిక్షణ పొందారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం నాగేశ్వరరావు

చాగల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కాల హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనపరిచి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు తెలిపారు. కైకరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో డిస్కస్‌త్రో అండర్ 14 బాలికల విభాగంలో పి.లక్ష్మిప్రసన్న ద్వితీయస్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్ 17 బాలుర విభాగంలో పాలపర్తి రేష్మంత్ బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్టస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ 17 బాలికల క్రికెట్ విభాగంలో నాగ శైలజ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఎంపికైన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయుడు కే.స్వామిలను గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

# మానవత సంస్థ కార్యక్రమాలపై సమీక్ష

ఉండ్రాజవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వడ్లూరు గ్రామంలో మానవత మండల సమావేశం మంగళవారం అధ్యక్షుడు కఠారి సిద్దార్థ రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మానవత సంస్థ లక్ష్యాలు, చేపట్టిన అంశాలు, చేయబోయే కార్యక్రమాలపై సమీక్షించారు. మానవత సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, జిల్లా నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, కె.సూర్యనారాయణ, గమిని రాంబాబు, రామిశెట్టి గంగాధరరావు, పోలవరపు రత్నాకరరావు, ఉమాశంకర్, బి.రామలక్ష్మి, తాతిని కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

## సినిమా గైడ్

**కొవ్వూరు**

| | |
|---|---|
| యువరాజ్‌మాల్ స్క్రీన్1 | : అమరన్ |
| వై.స్క్రీన్2 | : లక్కీ భాస్కర్ |
| దేవిశ్రీ(గాయత్రి | : క |
| అనన్య | : భఘీర |

**నిడదవోలు**

| | |
|---|---|
| వీ మ్యాక్స్ | : లక్కీ భాస్కర్ |
| రాధాకృష్ణ | : వెనం |
| శ్రీగణపతి | : అమరన్ |

**దేవరపల్లి**

| | |
|---|---|
| శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్ | : దేవర |
| త్రినాథ్ సినీ మ్యాక్స్ | : దేవర |